
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
3
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
గురువారం, 27 జూన్ 2024





వడ్డిపాళెం నుంచి పసుపు, కుంకుమను ఊరేగింపుగా తీసుకువస్తున్న భక్తులు (ఇన్‌సర్ట్) వెంగమాంబ కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కల్యాణం కమనీయం!

- రమణీయంగా వెంగమాంబ వివాహం
- వడ్డిపాళెం నుంచి పసుపు, కుంకుమ ఊరేగింపు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), జూన్ 26 : నర్రవాడలో వెంగమాంబ పేరంటాలు, గురవయ్య నాయుడుల కల్యాణం అశేష భక్తజనం నడుమ వేడుకగా జరిగింది. బ్రహ్మోత్సవాలలో భాగంగా నాల్గవ రోజు బుధవారం జరిగిన ఈ వేడుకను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత వెంగమాంబ ఉత్సవమూర్తులను, ముత్యాల తలంబ్రాలను ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కుటుంబ సభ్యులు, ఆలయ ధర్మకర్తలు, అర్చకులు భాజాభజంత్రీల నడుమ ప్రధాన ఆలయం నుంచి కల్యాణ వేదిక వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. స్వామిఅమ్మవార్లకు ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, ధర్మకర్తలు, అర్చకులు పట్టువస్త్రాలు తీసుకొచ్చారు. అమ్మవారి పుట్టినిల్లయిన వడ్డిపాళెం నుంచి పసుపు, కుంకుమను ఊరేగింపుగా దేవస్థానం వద్దకు తీసుకొచ్చారు. చిత్తూరు, గురజాల ఎమ్మెల్యేలు జగన్‌మోహన్‌రావు, యార్లగడ్డ వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే కంభం విజయ రామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబు యాదవ్, దేవదాయ శాఖ ఏసీ శ్రీనివాసులరెడ్డిలు అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈవో ఉషశ్రీ, మాజీ చైర్మన్ పచ్చవ కరుణాకర్‌బాబు, ఆలయ ధర్మకర్తలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కాగా కల్యాణాన్ని కనులారా వీక్షించేందుకు భక్తజనం తరలిరావడంతో నర్రవాడ గ్రామం కిక్కిరిసి పోయింది.

● అంబరాన్నంటిన ప్రధానోత్సవం

వెంగమాంబ ప్రధానోత్సవం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. వేలాది మంది అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. వడ్డిపాళెం నుంచి ప్రధానోత్సవం ప్రారంభమై నర్రవాడ వీధుల గుండా కొనసాగింది. భజనలు, బైనడీల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

● ఉత్సవాల్లో నేడు

వెంగమాంబ ఉత్సవాల్లో చివరి రోజు గురువారం బండ్లపొంగళ్లు, బండలాగుడు పోటీలు జరగనున్నాయి.



ఉత్సవమూర్తులను తీసుకొస్తున్న ఎమ్మెల్యే కాకర్ల, ఆలయ ధర్మకర్తలు

రొట్టెల పండుగకు విస్తృత ఏర్పాట్లు

- ప్రభుత్వ యంత్రాంగమంతా సమష్టిగా కృషి చేయాలి
- అధికారుల సమీక్షలో మంత్రులు ఆనం, నారాయణ

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 26 : నగరంలోని బారాషహీద్ దర్గాలో వచ్చే నెల 17వ తేదీ నుంచి రాష్ట్ర పండుగగా జరిగే రొట్టెల పండుగకు విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. పండుగ ఏర్పాట్లపై బుధవారం సాయంత్రం దర్గా ప్రాంగణంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కలిసి వారు సమీక్షించారు. మంత్రి ఆనం మాట్లాడుతూ భక్తుల కోరికలు తీరుతున్నందునే ఒకరోజు జరిగే పండుగ ఏడు రోజులకు చేరిందన్నారు. ఈ పండుగ ఏర్పాట్లు నగరానికే పరిమితం కాకుండా ఏఎస్‌పేట, కసుమూరులతోపాటు అన్ని మసీదులు, ఈద్గాల వద్ద భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రమాదాలు జరగకుండా రహదారులు, బీచ్‌ల వద్ద పోలీసులు రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. మరో మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ గతంలో ఆగిన అభివృద్ధి పనులను కొంత ఆలస్యంగానైనా పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకముందు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూసీఎం చంద్రబాబును ఒప్పించి దర్గాలో ఆగిన అభివృద్ధి పనులు పూర్తి చేయించాలని మంత్రులకు విజ్ఞప్తి చేశారు. దర్గా పరిసర ప్రాంతాలలో ఎవరూ బ్యానర్లు కట్టరాదని ఆదేశించారు. పండుగ కోసం చేస్తున్న పనులపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్త చూశారా అని అధికారులు ప్రశ్నించారు. పనులు నాణ్యతతో చేసి శాశ్వతంగా ఉండేలా చేయాలన్నారు. నాణ్యత లోపిస్తే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించవద్దని కమిషనర్‌ను కోరారు. అనంతరం ఎస్పీ ఆరీఫ్ హఫీజ్, కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్‌లను, ఇతర శాఖ అధికారులను శాఖాపరంగా చేపట్టే భక్తుల సౌకర్యాలను సమీక్షించారు. ప్రస్తుతం జరుగుతున్న పనులను మంత్రులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నేతలు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, భానుశ్రీ, తాళ్లపాక అనురాధ, విజితరెడ్డి, నగర అధ్యక్షుడు మామిడాల మధు, తదితరులు పాల్గొన్నారు.



స్వర్ణాల చెరువులో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు ఆనం, నారాయణ



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఆనం

వచ్చే నెల 1 నుంచి

డయేరియాపై స్పెషల్ డ్రైవ్

- కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ శ్రీకారం

నెల్లూరు (వైద్యం), జూన్ 26 : వర్షాకాలంలో డయేరియా (అతిసార) వ్యాధి ప్రబలకుండా కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ నివారణ చర్యలు చేపడుతోంది. జూలై 1 నుంచి రెండు నెలల పాటు వైద్య ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్ సంయుక్తంగా ఈ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సమాయత్తం అవుతున్నాయి. ఏఎన్ఎంలతోపాటు ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పిస్తారు. వ్యాధిగ్రస్థులను గుర్తించి చికిత్స వివరాలు సేకరించనున్నారు. గతంలో నెల్లూరులోని కుసుమ దళితవాడ, బట్వాడిపాళెంలో నీటి కాలుష్యం కారణంగా 70 మంది డయేరియాకు గురవగా ఇద్దరు మృత్యువాత పడ్డారు. గతేడాది కూడా జిల్లావ్యాప్తంగా డయేరియా కేసులు ఆందోళన కలిగించాయి.

● ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో బాధితులు

ఇప్పటికే ఉమ్మడి నెల్లూరు జిల్లాలో డయేరియా కేసులు ఆందోళన కలిగిస్తున్నాయి. గూడూరు మండలం చెన్నూరుకు చెందిన ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్‌లో 21 మంది విద్యార్థులు డయేరియాకు గురై చికిత్స పొందుతున్నారు. సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు, మర్రిపాడు, బుచ్చిరెడ్డిపాళెం మండలాల్లోనూ కేసులు నమోదయ్యాయి. జిల్లాలో 2వేల మంచినీటి రక్షిత పథకాలు ఉన్నాయి. 15 రోజులకోసారి ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేయాల్సి ఉంది. అయితే, ఇటీవల వరకు ఎన్నికల హడావిడి ఉండటంతో చాలా గ్రామాల్లో ట్యాంకులను శుభ్రం చేయలేదు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో ఆయా ట్యాంకుల ద్వారా వచ్చే నీరు కలుషితమవుతోంది. తాగునీటి పైపుల్లో మురుగు చేరి కూడా నీరు కలుషితమవుతోంది. వీటి ద్వారా పలువురు డయేరియాకు గురవుతున్నారు.

రామతీర్థం తిరునాళ్ల ప్రారంభం

విడవలూరు, జూన్ 26: విడవలూరు మండలం రామతీర్థంలో వెలసిన కామాక్షీ దేవి సమేత రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం అంకురారోపణతో ఆరంభమయ్యాయి. ప్రధానార్చకుడు పేరేపి శ్రీకాంత్ శర్మ, అర్చకులు, యాగ్నికులు 9 రోజుల దీక్ష చేపట్టారు. తిరుపతికి చెందిన కొండూరు నాగరాజన్ ఉభయకర్తగా వ్యవహరించారు. ఆలయ ఈవో రామ కృష్ణ పర్యవేక్షించారు.

చేయి తడిపితేనే సర్వీస్!

నెల్లూరు, (జడ్పీ),జూన్ 26 : విద్యుత్ శాఖను అవినీతి జలగలు పట్టి పీడిస్తున్నాయి. కొంతమంది అధికారుల తీరువల్ల మొత్తం ఆ శాఖకే మచ్చ ఏర్పడుతోంది. జిల్లాలో నూతనంగా వెలుస్తున్న లే అవుట్లు, వాణిజ్య కనెక్షన్లు వారికి కల్పతరువుగా మారుతున్నాయి. కేవలం నిర్ణీత ఫీజులు చెల్లిస్తే చాలు

- విద్యుత్ శాఖలో అవినీతి జలగలు
- కల్పతరువుగా వాణిజ్య కనెక్షన్లు
- కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు వాటాలు
- అధికారుల తీరుపై వినియోగదారుల్లో ఆగ్రహం
- ఏసీబీ అధికారులను ఆశ్రయిస్తున్న వైనం

విద్యుత్ సర్వీసు ఇవ్వాల్సి ఉండగా ఫీజుతోపాటు అడిగిన మొత్తాన్ని అదనంగా చెల్లిస్తేనే పని అవుతుందని కొంతమంది అధికారులు తేల్చి చెబుతున్నారు. ఇలా వసూలు చేసిన మామూళ్లలో పై స్థాయి అధికారులకూ వాటాలు ఇస్తున్నట్లు సమాచారం. దీంతో వినియోగదారులు ఫిర్యాదు చేసినా ఉపయోగం ఉండదనే భావనతో అడిగిన కాడికి ఇచ్చుకుంటూ కనెక్షన్లు పొందుతున్నారు. అయితే, మరికొందరు అధికారులు అడిగినంత ఇవ్వలేక అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులను ఆశ్రయిస్తున్నారు. ఇందులో భాగంగానే తాజాగా నెల్లూరు శివార్లలోని కొత్తూరు ఏఈ ఓ లే అవుట్ కనెక్షన్‌కి రూ.80 వేలు డిమాండ్ చేసి రూ.50 వేలు తీసుకుంటూ అడ్డంగా ఏసీబీ అధికారులకు దొరికిపోయాడు.

● లే అవుట్లు అంటే కాసులే!

జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతుండటంతో విద్యుత్ శాఖాధికారులకు మామూళ్ల పంట భారీగా పండుతోంది. నెల్లూరు నగరంతోపాటు రూరల్, ఇందుకూరుపేట, కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం, ఆత్మకూరు, ఉదయగిరి, కొడవలూరు, కావలి, విడవలూరు తదితర మండలాల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. వందల ఎకరాల పంట భూములు లైఅవుట్లుగా మారుస్తున్నారు. ఇలా ఏర్పాటైన లే అవుట్లలో తొలిగా విద్యుత్ కనెక్షన్ తీసుకోవాల్సి ఉంది. ఇందుకు అవసరమైన స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్ల ఏర్పాటుకు ఎంత ఖర్చు అవుతుందో విద్యుత్ శాఖాధికారుల అంచనా ప్రకారం లేఅవుట్ యజమానులు చెల్లించి సర్వీసులు పొందుతారు. అయితే, లే అవుట్లలోని ఒక్కో ఎకరా చొప్పున లెక్కించి రూ.50వేలు నుంచి లక్ష మేర అధికారులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనికి కొంతమంది ప్రైవేట్ విద్యుత్ కాంట్రాక్టర్లు మధ్యస్థం చేస్తూ రియల్టర్ల నుంచి వసూలు చేసిన నగదును అధికారులు అందజేస్తున్నారు. ఇలా వచ్చిన నగదులో కిందిస్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు వాటా ఇవ్వాల్సి ఉంటుందని సాక్షాత్తు అధికారులు చెబుతున్నారు. ఉన్నతాధికారులకూ వాటాలు ఇస్తుండటంతో సర్వీసుల పేరుతో అవినీతి వ్యవహారం జోరుగా సాగుతోంది. అలాగే అపార్టుమెంట్లు, రొయ్యల గుంతలకు, వాణిజ్య భవనాలకు ఒక్కో కనెక్షన్‌కి రూ.15వేల నుంచి 40వేల వరకు వసూలు చేస్తున్నారు. ఈ అవినీతి వ్యవహారం ఉన్నతాధికారులకు తెలిపినా ప్రయోజనం లేకపోవడంతో బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అవినీతి జలగలపై చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.



'డీసీఎంఎస్'లో

ప్రభుత్వ ఆడిట్

- రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాలు

నెల్లూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)లో సహకార శాఖ ఆడిటర్లతో ఆడిటింగ్ చేయించేందుకు రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. 2021-22, 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన అంతిమ ఆడిట్‌ను చేసేందుకు ప్రభుత్వ ఆడిటర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. త్వరగా ఈ ఆడిట్‌ను పూర్తి చేయవలసిందిగా సహకార శాఖ అదనపు రిజిస్ట్రార్ నుంచి ఆదేశాలు అందినట్లు జిల్లా సహకార శాఖాధికారి బీ గుర్రప్ప తెలిపారు. ఈ నెల 25వ తేదీన 'డీసీఎంఎస్‌లో లెక్కలేని తనం' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందిస్తూ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మూడేళ్ల నుంచి డీసీఎంఎస్‌లో ప్రైవేటు చార్టెడ్ అకౌంటెంట్లతో ఆడిట్ చేయిస్తున్న మాట వాస్తవమేనని, ఈ ఆడిట్ రిపోర్టును తాము తిరస్కరించినట్లు చెప్పారు. ఇదే విషయాన్ని రాష్ట్ర సహకార శాఖ అదనపు రిజిస్ట్రార్‌కు తెలియజేశామని పేర్కొన్నారు. డీసీఎంఎస్ ప్రభుత్వానికి రూ.17.73 లక్షల రుణ బకాయిలు చెల్లించాల్సి ఉందని వెల్లడించారు. రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరగా డీసీఎంఎస్‌లో ఆడిటింగ్ పూర్తి చేస్తామని, ఏవైనా ఆర్థిక అవకతవకలు బయటపడితే బాధ్యులపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని గుర్రప్ప తెలిపారు. 2020-21 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆర్థిక అవకతవకలు గుర్తించామని, బాధ్యులపై చర్యల తీసుకునేందుకు చార్జెస్ ఫ్రేమ్ చేయాల్సిందిగా ఒంగోలు సహకార శాఖాధికారిని రాష్ట్ర ఉన్నతాధికారులు నియమించారని పేర్కొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీలో

జిల్లాకు 2వ స్థానం

ప్రథమ సంవత్సరం ఫలితాల విడుదల

నెల్లూరు (విద్య), జూన్ 26 : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో జిల్లా ద్వితీయస్థానం సాధించింది. బుధవారం విడుదలైన ప్రథమ సంవత్సరం ఫలితాల్లో జిల్లా విద్యార్థులు 55 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆర్ఐవో ఎ.శ్రీనివాసులు తెలిపారు. జనరల్ విభాగంలో పరీక్షలకు 6910 మంది హాజరవగా 3786 మంది ఉత్తీర్ణతతో రాష్ట్రంలో ద్వితీయస్థానం, ఒకేషనల్ విభాగంలో 317 మందికిగాను 211 మంది ఉత్తీర్ణతతో (67 శాతం) ఫలితాలతో రాష్ట్రంలో తృతీయ స్థానాన్ని సాధించిందన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో 16, ప్రైవేట్ విభాగంలో 2 కళాశాలలు వందశాతం ఫలితాలు సాధించాయన్నారు.

● రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలి

మార్కుల విషయంలో సంతృప్తి చెందని విద్యార్థులు రీవెరిఫికేషన్ బీఐఈ డాట్ ఏపీ డాట్ జీఓవీ డాట్ ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆర్ఐఓ తెలిపారు. ఈ నెల 28 నుంచి జూలై 4వ తేదీ లోపు రూ.వెయ్యి ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

జిల్లాకు రానున్న ఎస్‌ఐలు

నెల్లూరు(క్రైం) : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాను వీడిన ఎస్‌ఐలను తిరిగి వెళ్లాలని గుంటూరు సౌత్ కోస్టల్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాకు చెందిన ఎస్‌ఐలు ఐ మస్తానయ్య, ఎం రాంబాబు, కె వెంకటాద్రినాయుడు, వీసీహెచ్ సుబ్రహ్మణ్యం, టీ.వెంకటేశ్వర్లు బాపట్లకు, ఎస్ సాయిప్రసాద్, కె బాలకృష్ణ, ఎస్‌డీ అబ్దుల్ రహీమ్, బీ తిరుపతయ్య, వీ వెంకటేశ్వర్లు, కే ఎడ్వర్డ్, ఎల్ రాములు, వి మాల్యాద్రిలు గుంటూరు జిల్లాకు వెళ్లారు. వారందరిని తిరిగి నెల్లూరు జిల్లాకు కేటాయించారు. గుంటూరు జిల్లాకు చెందిన ఎం కోటేశ్వరరావు, టీ వెంకటరావు, పీ వెంకటేశ్వర్లు, పీ సుబ్బారావు, టీ.పెంచలయ్య, ఎం జోజి, వీ.వెంకటరావు, పల్నాడు జిల్లాకు చెందిన వీఆర్‌కె మూర్తి, బి మధుసూదనరావు, బాపట్ల జిల్లాకు చెందిన బి మాణిక్యరావు, ఎం శ్రీనివాసులు, వీ భాస్కర్‌రావు, పి జనార్ధనరావు, కె నాగేశ్వరరావు, వి రాంబాబు, జే రమాదేవిలు జిల్లాకు వచ్చారు. వారందరిని తిరిగి ఆ జిల్లాలకే కేటాయించారు.

ఐటీడీఏ పీఓపై విచారణ

విచారణాధికారిగా జడ్పీ సీఈవో

నెల్లూరు (హరనాథపురం) : ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (పీవో) మందా రాణిపై విచారణకు జడ్పీ సీఈఓ కన్నమ నాయుడును కలెక్టర్ హరినారాయణన్ విచారణాధికారిగా నియమించారు. దీంతో ఆయన ఐటీడీఏ కార్యాలయానికి వెళ్లి విచారించినట్లు తెలిసింది. పీఓపై ఫిర్యాదు చేసిన గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్యను జడ్పీ కార్యాలయంలోని తన ఛాంబర్‌కు పిలిపించి విచారించారు. పీఓ అవినీతి, నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని, విచారించి చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్, జాతీయ ఎస్టీ కమిషన్‌కు కేసీ పెంచలయ్య ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించాలని వారు కలెక్టర్‌కు ఆదేశం చడంతో జడ్పీ సీఈఓ విచారించి, నివేదికను కలెక్టర్‌కు సమర్పిం చినట్లు తెలిసింది.



ఆర్టీసీ బస్టాండు వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసులు

ఘటికులే!

- జల్సాల కోసం బైక్‌ల అపహరణ
- నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో కేసులు
- చివరకు పోలీసులకు చిక్కిన యువకులు
- రూ.15 లక్షల సొత్తు స్వాధీనం



నిందితుల వివరాలు తెలుపుతున్న ఎస్పీ ఆరీఫ్ హఫీజ్

నెల్లూరు (క్రైం), జూన్ 26: చిన్ననాటి నుంచే స్నేహితులుగా ఉన్న ఆ ముగ్గురు యువకులు చెడు వ్యసనాలకు బానిసలయ్యారు. జల్సాల కోసం బైక్ దొంగతనాలనే వృత్తిగా మలుచుకున్నారు. వరుసగా బైక్ చోరీలకు పాల్పడుతూ పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న ఆ ముగ్గురు చివరకు కటకటాలపాలయ్యారు. నెల్లూరు సీసీఎస్, కావలి పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి బుధవారం అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలను ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ కె ఆరీఫ్ హఫీజ్ వెల్లడించారు. బోగోలు మండలం కప్పరాళ్ల తిప్పకు చెందిన పి భానుప్రకాష్, జి గోమ్స్, జి హనుమాన్‌లు చెడువ్యసనాలకు బానిసలయ్యారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో బైక్ దొంగతనాలు చేసి వాటిని అమ్మిన నగదుతో జల్సాలు చేస్తున్నారు. కావలి వన్ టౌన్, రూరల్ పోలీసు స్టేషన్లలో అందిన ఫిర్యాదులతో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు సీహెచ్ కోటేశ్వరరావు, సాంబశివరావు, కావలి ఒకటోపట్టణ ఇన్‌స్పెక్టర్ రాజేష్‌లు తమ సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసుకొని నిందితుల కోసం వేట మొదలు పెట్టారు. సాంకేతికత ఆధారంగా బుధవారం నిందితులను కావలిలోని తుమ్మలపెంట రోడ్డు వద్ద అదుపులోకి తీసుకున్నారు. కావలి, చీరాల, ఒంగోలు రూరల్, కనిగిరి పోలీసు స్టేషన్ల పరిధిలో రూ.15 లక్షలు విలువ చేసే 21 బైక్‌లు దొంగలించినట్లు విచారణలో నిందితులు తెలిపారు. ఆ మేరకు 21 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసిన సీసీఎస్, కావలి డీఎస్పీలు పి రామకృష్ణాచారి, ఎం వెంకటరమణ, సీసీఎస్, కావలి ఇన్‌స్పెక్టర్లు, సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు.



స్వాధీనం చేసుకున్న బైక్‌లు

యువతా మేలుకో..

జీవితాన్ని చక్కదిద్దుకో!

నెల్లూరు (క్రైం), జూన్ 26 : 'యువతా మేలుకో.. జీవితాలను చక్కదిద్దుకో..!' అంటూ నెల్లూరులో పోలీసులు ర్యాలీ నిర్వహించారు. బుధవారం మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలు నుంచి ఆర్టీసీ బస్టాండు మీదుగా తిరిగి పోలీస్ మైదానం వరకు సాగిన ఈ ర్యాలీలో నెల్లూరు నగర టౌన్ డివిజన్, సెబ్ పోలీసు అధికారులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు. ఆర్టీసీ బస్టాండు వద్ద మానవహారంగా ఏర్పడి డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేస్తామంటూ అదనపు ఎస్పీ సౌజన్య ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు విక్రయించి సొమ్ము చేసుకుందామని ఎవరైనా భ్రమపడి అమాయక యువతను, విద్యార్థులను ప్రలోభపెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఏవీఆర్పీబీ ప్రసాద్, శ్రీనివాసరావు, నగర డీఎస్పీ డి శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



ప్రమాదం జరిగిన చోట సుధాకర్ మృతదేహం

నెల్లూరు రూరల్, జూన్ 26 : నెల్లూరు-ముత్తుకూరు రహదారిపై గుండ్లపాలెం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాలు మేరకు.. నెల్లూరు రూరల్లోని ధనలక్ష్మీపురం ప్రాంతానికి చెందిన జొన్నలగడ్డ సుధాకర్ (55) ఓ ప్రైవేట్ ఆసుపత్రి బస్సుకు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పొరుగు జిల్లా నుంచి అనారోగ్య బాధితులను ఆసుపత్రికి తీసుకువచ్చిన అనంతరం డ్యూటీ దిగి తిరిగి ధనలక్ష్మీపురానికి స్కూటర్‌పై బయలుదేరాడు. గుండ్లపాలెం వద్ద ఎదురుగా వస్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో సుధాకర్‌రెడ్డి రోడ్డుపై పడి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలున్నారు. కారు డ్రైవర్ పరారయ్యాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.

అర్ధరాత్రి ఇసుక అక్రమ తరలింపు

● దాడి చేసిన సెబ్, పోలీసు అధికారులు ● ఎక్స్‌కవేటర్, టిప్పర్ సీజ్



పోలీస్ స్టేషన్‌లో సీజ్ చేసిన ఎక్స్‌కవేటర్, టిప్పర్

సంగం, జూన్ 26: పెన్నానది ఇసుక రీచ్ నుంచి మంగళవారం అర్ధరాత్రి ఇసుక అక్రమ తరలింపుపై సెబ్, పోలీస్ అధికారులు దాడులు నిర్వహించారు. దాడుల్లో జేసీబీ, టిప్పర్‌ను అదుపులోకి తీసుకుని సీజ్ చేశారు. వివరాల మేరకు.. సంగం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు జేసీబీ, టిప్పర్లతో పెన్నానది రీచ్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా స్థానికులు గుర్తించి బుచ్చి సెబ్ సీఐ యశోదరకు సమాచారం అందించారు. ఆమె స్పందించి ఎస్ఐ నాగార్జునరెడ్డి, పోలీస్ సిబ్బంది సహకారంతో ఇసుక రీచ్‌కు వెళ్లి దాడి చేయడంతో జేసీబీతో టిప్పర్‌కు ఇసుక లోడ్ చేస్తుండగా పట్టుకున్నారు. అప్పటికే సిద్ధంగా ఉన్న మరో నాలుగు టిప్పర్లు అధికారుల రాకను గమనించిన అక్కడి నుంచి జారుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో పట్టుబడిన జేసీబీ, టిప్పర్‌ను సీజ్ చేసి సంగం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

● **కారు ఢీకొని..**

కావలి రూరల్ : ఆముదాలదిన్నె సమీపాన జాతీయరహదారిపై బుధవారం ఓ ఆవును కారు ఢీకొనగా తీవ్రగాయాలయ్యాయి. పశువుల కాపరి వెంగయ్య, మరో రైతు అక్కడకు చేరుకునేలోపు డ్రైవర్ కారును ఆపకుండా వెళ్లిపోయాడు. ఈ ప్రమాదంలో కోలుకోలేని విధంగా ఆవు గాయపడడంతో సుమారు రూ.70 వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం తనకు పరిహారం చెల్లించాలని ఆయన కోరాడు.

విద్యుదాఘాతానికి పూరిల్లు దగ్ధం

సంగం, జూన్ 26: జండాదిబ్బ పంచాయతీలోని అరవపాళెంలో మంగళవారం అర్ధరాత్రి ఆదిశేషయ్య పూరిల్లు విద్యుదాఘాతానికి గురైంది. ఈ ప్రమాదంలో ఇంటి పైకప్పుకు మంటలు వ్యాపించి చుట్టిముట్టాయి. నిద్ర మేల్కొన్న కుటుంబసభ్యులు బయటకు పరుగెత్తి కేకలు వేశారు. చుట్టు పక్కల వారు వచ్చి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించి నా సాధ్య పడలేదు. ఆత్మకూరు అగ్నిమాపకకేంద్ర సిబ్బంది వచ్చి మంటలు చుట్టుపక్కల ఇళ్లకు వ్యాపించకుండా ఆర్పి వేశారు. అప్పటికే ఇంటిలోని వంట సామగ్రి, బట్టలు, మంచాలు, బియ్యం, రూ. 3,500ల నగదు కాలి బూడిదైపోయాయి. వీఆర్వో సుధాకర్ బుధవారం గ్రామానికి పరిస్థితి ని సమీక్షించారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దుకాణంలో మంటలు

● రూ.9 లక్షల ఆస్తి నష్టం



మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక దళం

నెల్లూరు(క్రైం), జూన్ 26: నెల్లూరు నగరంలోని కనకమహల్ సెంటర్‌లో ఉన్న పీఎస్ఆర్ అండ్ సన్స్ దుకాణంలో బుధవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. ఉదయం 9.30 గంటల సమయంలో దుకాణంలోని మొదటి, రెండు అంతస్థుల్లో పొగలు రావడాన్ని గుర్తించిన కూలీలు వెంటనే అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది నిచ్చెన సాయంతో అతి కష్టంగా దుకాణంలోని మొదటి, రెండవ అంతస్థులోకి ప్రవేశించి రెండు ఫైర్ ఇంజన్ల సాయంతో మంటలను అదుపు చేశారు. దుకాణంలో పీవీసీ పైపులు, సింటెక్స్ డ్రమ్స్, వాటర్ పైపులు ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించాయి. అతి కష్టంపైన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు రూ.9 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు పీఎస్ఆర్ అండ్ సన్స్ దుకాణం యజమానులు జనార్దన్‌రావు, సీతారామయ్య ఫిర్యాదులో పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కావలి రూరల్, జూన్ 26: పట్టణంలోని జనతాపేటలో తాళం వేసిన ఇంట్లో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. నాలుగు గ్రాముల బంగారంతోపాటు రూ.2 వేల నగదును అపహరించుకుపోయారు. పోలీసుల కథనం మేరకు, జనతాపేటలో నివాసముంటున్న తోడింగల సుధీర్ భార్య గౌరీ పనుల నిమిత్తం బంధువులతో కలసి మంగళవారం రాత్రి హైదరాబాద్‌కు వెళ్లారు. ఇంటికి తాళం వేసి సుధీర్ పట్టణంలో జరిగే ఫంక్షన్‌కు వెళ్లాడు. అర్ధరాత్రి ఆయన ఇంటికి రాగా తలుపులు తీసి ఉన్నాయి. లోపల అడుగుపెట్టేసరికి ఇంట్లో నుంచి ఇద్దరు వ్యక్తులు పరుగున వచ్చి సుధీర్‌ను నెట్టేసి పరారయ్యారు. ఇంటి తాళం పగలగొట్టిన దుండగులు లోపలికి ప్రవేశించి, బీరువాలోని నాలుగు గ్రాముల బంగారు కమ్మలు, తాళిబొట్టు, డాలర్‌తోపాటు రూ.2వేల నగదు అపహరించుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రెండో పట్టణ ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరు విజలెన్స్ ఇన్‌చార్జి అధికారిగా భవానీ హర్ష

నెల్లూరు(క్రైం) : నెల్లూరు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌చార్జి అధికారిగా భవానీ హర్షను నియమిస్తూ ఆ విభాగం డీజీ హరీష్‌కుమార్ గుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత ప్రభుత్వం పదవీ విరమణ చేసిన కె రాజేశ్వరరెడ్డిని నెల్లూరు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా ఓఎస్‌డీగా నియమించింది. ఇటీవల ఆయన రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో ఒంగోలు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా ఉన్న భవాణిహర్షను నెల్లూరు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌చార్జ్ అధికారిగా నియమించారు.

ఘనంగా మహాసంప్రోక్షణ



నెల్లూరు(సాంస్కృతికం) : అయ్యప్పగుడిలో గోదా మహాలక్ష్మీ సమేత గురువాయూర్ మహావిష్ణు ఆలయంలో బుధవారం మహాసంప్రోక్షణ జరిగింది. ఉదయం ద్వారతోరణం, చక్రాబ్ది మండల మహాకుంభారాధన, చదుష్కండలతో విశేష హోమాలు, శాంతి హోమం, ప్రాయచిత్తహోమం, మహాపూర్ణాహుతి, మహాకుంభ సంప్రోక్షణలు జరిగాయి. అనంతరం ఆరాధన, మహానివేదన, కర్పూర హారతి, శాత్తుమురై, తీర్థప్రసాద, వితరణలు జరిగాయి. సాయంత్రం కనుల పండుగ ఊంజల్ సేవ జరిగింది. ఆలయ ఛైర్మన్ జి.శేషగిరిరావు మాట్లాడుతూ గురువాయూర్ మహావిష్ణువుకు 2వతేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతాయని, భక్తులు తరలిరావాలని కోరారు.

29న ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 26 : జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 29వ తేది నిరుద్యోగులైన అభ్యర్థులకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కేవీ రామాంజనేయులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐ మ్యారే సొల్యూషన్ కంపెనీలో 50 కాల్‌సెంటర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఎంపికలు జరుగుతాయని, ఏదైనా డిగ్రీ, డిప్లమో విద్యార్హతలు కలిగి 18 ఏళ్ల పైబడిన వారు హాజరు కావచ్చని పేర్కొన్నారు. నాయుడుపేటలోని అరబిందో ఫార్మసీలో పలు విభాగాల్లో 100 పోస్టులకు ఐటీఐ, డిప్లమో, బిటెక్, ఎమ్‌టెక్, బయోటెక్నాలజీ చేసిన వారు, నియోలెన్సీలో మొబైల్ అసెంబ్లింగ్‌లో 40 పోస్టులకు పదవ తరగతి, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. ఇంటియా ఇంజనీరింగ్ వర్క్స్ అండ్ మ్యాన్ పవర్ సర్వీసెస్ స్కిల్డ్ 80, అన్ స్కిల్డ్ 40తో కలిపి 120 పోస్టులకు ఐటీఐ, డిప్లమో అన్ని ట్రేడ్‌ల విద్యార్హతలు కలిగిన వారు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు 29వ తేది ఉదయం 10.30 గంటలకు ఉపాధి కార్యాలయానికి చేరుకోవాలని తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	140
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	250
స్కిన్‌లెస్	280
లేయర్	204

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6817
వెండి కిలో ధర	రూ. 89,700
వెండి ఒక గ్రాము	రూ. 91.70

విలీన పాపం..
ప్రజాధనానికి శాపం!

● వైసీపీ హయాంలో ప్రాథమిక విద్యకు తీవ్ర నష్టం
● 3, 4, 5 తరగతుల తరలింపు
● నాడు ఆధునీకరించిన భవనాలు నేడు వెలవెల



ఉదయగిరి మండలం అప్పసముద్రం మెయిన్ ప్రాథమిక పాఠశాల ఇది. నాడు-నేడు పథకంలో భాగంగా తొలి విడతలో రూ.13.73 లక్షలతో పాఠశాలను ఆధునికీకరించారు. జీవో నెం.117 అమలులో భాగంగా ఇక్కడున్న 3, 4, 5వ తరగతులను సమీప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విలీనం చేశారు. దీంతో ఈ పాఠశాలలో కేవలం 9 మంది విద్యార్థులే మిగలగా, ఇద్దరు ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. రూ.లక్షలు వెచ్చించి మరమ్మతులు చేపట్టిన పాఠశాల ఇప్పుడు వెలవెలబోతోంది.



ఉదయగిరి మండలం వెంగళరావునగర్ మెయిన్ పాఠశాలను నాడు-నేడు తొలివిడతలో రూ.16.58 లక్షలు వెచ్చించి ఆధునికీకరించారు. అయితే, ఈ బడి జడ్పీ ఉన్నత పాఠశాలకు సమీపంలో ఉండటంతో 3, 4, 5వ తరగతులను అందులో విలీనం చేశారు. 1, 2వ తరగతుల్లో 15 విద్యార్థులు ఉన్నారు. దీనిపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉదయగిరి రూరల్, జూన్ 26 : వైసీపీ ప్రభుత్వ హయాంలో పాఠశాలల అడ్డగోలు విలీనంతో ప్రాథమిక విద్యకు తీవ్ర నష్టం వాటిల్లింది. జీవో నెం.117ను అశాస్త్రీయంగా తీసుకొచ్చి జిల్లాలో వందల సంఖ్యలో ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5వ తరగతులను సమీపంలో ఉండే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసింది. గ్రామాల్లో ప్రాథమిక విద్యకు ఉరి వేయడంతోపాటు మనబడి నాడు-నేడు పథకం కింద మరమ్మతులు చేపట్టి అందంగా రంగులుదిద్దుకొన్న ప్రాథమిక పాఠశాలలు 1, 2వ తరగతులకు పరిమితమై విద్యార్థులు లేక వెలవెల బోతున్నాయి. వాటి మరమ్మతుల కోసం వెచ్చించిన లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అయ్యింది.

● **లక్షల రూపాయలు వృథా**

ఉదయగిరి మండలంలోని అప్పసముద్రం, వెంగళరావునగర్ మెయిన్ పాఠశాలలతోపాటు కృష్ణంపల్లి మెయిన్ రూ.15.73 లక్షలు, గన్నేపల్లి పాఠశాలలను రూ.11.24 లక్షలతో తొలివిడతలో మరమ్మతులు చేపట్టారు. ప్రస్తుతం ఆయా పాఠశాలల్లోని 3, 4, 5వ తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడంతో అరకొరగానే విద్యార్థులు ఉన్నారు. దీంతో తరగతి గదులు, చేసిన పనులు నిరుపయోగంగా మారాయి. ఇలా జిల్లాలో వందల సంఖ్యలో పాఠశాలలు విలీనం కావడంతో రూ.లక్షల ప్రజాధనం వృథా అయ్యింది.

● **జీవో నెం.117ను రద్దు చేయాలి**

జీవో నెం.117ను రద్దు చేసి ప్రాథమిక విద్యను కాపాడాలని ఉపాధ్యాయ సంఘాలు నిరసనలు వ్యక్తం చేసినా, విద్యార్థుల తల్లిదండ్రులు సైతం రోడ్డుమీదకు వచ్చినా గత వైసీపీ సర్కారు పట్టించుకోలేదు. ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. సదరు జీవోను రద్దు చేసి ప్రాథమిక విద్య ఐదో తరగతి వరకు ఒకేచోట ఉండేలా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. ప్రాథమిక పాఠశాలలకు పూర్వ వైభవం రావడంతోపాటు డ్రాపవుట్స్ సంఖ్య తగ్గి విద్యార్థి సొంత ఊరి నుంచే విద్యాభ్యాసం చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

టీడీపీ సీనియర్ నేత కిలారి కన్నుమూత

● మంత్రులు, ఎమ్మెల్యేల నివాళి



కిలారి వెంకటస్వామి (ఫైల్)

నెల్లూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, జిల్లా గ్రంథాల య సంస్థ మాజీ ఛైర్మన్ కిలారి వెంకటస్వామి నాయుడు బుధవారం వేకువజాము న నెల్లూరు బీవీ నగర్‌లోని తన నివాసంలో గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. టీడీపీ ఆవిర్భావం నుంచి కిలారి పార్టీలో కొనసాగుతున్నారు. నెల్లూరు మున్సిపల్ కౌన్సిలర్‌గా, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా పనిచేశారు. టీడీపీ నెల్లూరు పట్టణ అధ్యక్షుడుగా, కొంత కాలం నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్తగా కూడా బాధ్యతలు నిర్వహించారు. రూరల్ నియోజకవర్గంలో మంచి పట్టున్న నాయకుడిగా పేరు సంపాదించుకున్నారు. కిలారి మృతి టీడీపీ శ్రేణులను దిగ్భ్రాంతికి గురి చేసింది. మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామ నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలు కిలారి భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిలు కిలారి మరణంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కిలారి అంత్యక్రియల్లో తెలుగు దేశం పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నాయి.





కిలారి వెంకటస్వామి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మంత్రులు నారాయణ, ఆనం టీడీపీ నేత కోటంరెడ్డి

వీఎస్‌యూలో పీహెచ్‌డీ ఇంటర్వ్యూలు



అభ్యర్థిని ఇంటర్వ్యూ చేస్తున్న సబ్జెక్ట్ నిపుణులు

వెంకటాచలం, జూన్ 26 : విక్రమ సింహపురి యూనివర్సిటీ ప్రాంగణంలో ఏపీఆర్ సెట్ 2023-24 క్వాలిఫై అయిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు జరుగుతున్నాయి. బుధవారం టూరిజం మేనేజిమెంట్, అప్లైడ్ లైఫ్ సైన్స్, బయోటెక్నాలజీ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు జరిగాయి. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల సబ్జెక్ట్ నిపుణులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుండి అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా, డాక్టర్ ఎం హనుమారెడ్డి సమన్వయకర్తగా వ్యవహరించారు. అభ్యర్థులకు అన్ని సౌకర్యాలను కల్పించారు. గురువారం కూడా ఇంటర్వ్యూలు కొనసాగుతాయని హనుమారెడ్డి తెలిపారు.

టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో 8వ స్థానం

● జిల్లాలో 78.44 శాతం ఉత్తీర్ణత

నెల్లూరు(విద్య), జూన్ 26: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాల్లో 78.44 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్ర స్థాయిలో జిల్లా 8వ స్థానంలో నిలిచింది. బుధవారం రాత్రి ఫలితాలు విడుదల చేశారు. జిల్లాలో బాలురు 2,719 మంది, బాలికలు 1,664 మంది కలిపి 4,383 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 2,093 మంది బాలురు, 1,345 మంది బాలికలు కలిపి 3,438 మంది ఉత్తీర్ణత సాధించారు. గతేడాది టెన్త్ అడ్వాన్స్‌డ్‌లో 13వ స్థానంలో నిలిచిన జిల్లా ఈ సారి కొంత మెరుగుపడి 8వ సానానికి చేరింది. నాలుగు రోజుల అనంతరం మార్కుల జాబితాలను అధికారిక వెబ్‌సైట్ www.bse.ap.gov.inలో అందుబాటులో ఉంటాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు. సంబంధిత హెచ్‌ఎంలు స్కూల్ లాగిన్ నుంచి మార్కుల జాబితా, వ్యక్తిగత షార్ట్ మెమోలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. విద్యార్థులు సైతం నేరుగా అధికారిక వెబ్‌సైట్ నుంచి వారి ఫలితాలు, షార్ట్ మెమోలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

7లోగా రీకౌంటింగ్‌కు అవకాశం

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి విద్యార్థులు ఈనెల 27 నుంచి జూలై 7వతేదీ లోపల రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని డీఈవో రామారావు తెలిపారు. ఫీజు కూడా హెచ్‌ఎంలకే చెల్లించాలన్నారు. అన్ని ఫీజుల చెల్లింపులు ఆన్‌లైన్ అప్లికేషన్‌లో మాత్రమే చేస్తారన్నారు. ఎట్టి పరిస్థితిల్లోనూ సీఎఫ్ఎంఎస్ సిటిజన్ చలాన్ ద్వారా ఫీజు చెల్లింపులు జరగవని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సంబంధిత పాఠశాలల్లో సంప్రదించాలని సూచించారు.

గుట్టుగా ప్రజాభిప్రాయ సేకరణ

● అడ్డుకున్న గ్రామస్థులు, టీడీపీ నాయకులు ● వెనుదిరిగిన నాయకులు



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో మాలోల

పొదలకూరు, జూన్ 26 : మేజర్ పంచాయతీ పరిధిలోని సర్వే నెంబరు 707 చిట్టేపల్లి తిప్ప వద్ద గత ప్రభుత్వంలో లీజులు మంజూరై క్వార్ట్జ్ మైనింగ్‌పై నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ప్రజాభిప్రాయ సేకరణను గ్రామస్థులు, మండల టీడీపీ నాయకులు బుధవారం అడ్డుకున్నారు. టాం టాం వేయకుండా ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా ప్రజాభిప్రాయ సేకరణ ఎలా చేస్తారని నెల్లూరు ఆర్డీవో మాలోల, పర్యావరణ పరిరక్షణ ఈఈ రాజేశేఖర్‌లను గ్రామస్థులు, టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్తత నెలకొంది. గ్రామాలను దుమ్ముధూళితో వల్లకాడు చేస్తారా అంటూ గ్రామస్థులు తిరగబడ్డారు. ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో స్థానికులకు తప్ప తెలంగాణా, తిరుపతి, గూడూరు వారికి సమాచారం ఇచ్చారే కాని అసలైన స్థానికులకు, ప్రజాప్రతినిధులకు, మీడియా, పత్రికా విలేకరులకు సమాచారం అందించకుండా ఎందుకు రహస్యంగా జరుపుతున్నారని, నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఈ ప్రజాభిప్రాయ సేకరణను తక్షణమే నిలుపుదల చేయాలని మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు పట్టుబట్టారు. అక్కడే వేదిక వద్ద కూర్చుని నినాదాలు చేశారు. స్థానిక ఎస్సై డి రామకృష్ణ రంగప్రవేశం చేసి ఇరువురికి సర్దిచెప్పడంతో మరొకరోజు ప్రజాభిప్రాయ సేకరణ ఏర్పాటుచేస్తామని, ముందుగా తేదీలను వెల్లడిస్తామని ఆర్డీవో మాలోలా చెప్పడంతో అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీసులు, చిట్టేపల్లి, పొదలకూరు, లింగంపల్లి గ్రామస్థులు పాల్గొన్నారు.

జోగుపల్లిలో జేసీ...

సైదాపురం, జూన్ 26: జోగిపల్లిలో స్టార్ మినరల్స్ మైనింగ్ అనుమతులపై బుధవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ సేతుమాదవన్ మాట్లాడారు. సర్వేనెంబర్ 11/ఎ, 11బిలో ఓపెన్ కాస్ట్ పద్ధతిలో 7.838 హెక్టార్ల విస్తీర్ణంలో చేపట్టే మైకా ప్రాజెక్టు కోసమే ఈ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టామన్నారు. వీటి అనుమతులపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామని చెప్పారు. అనుమతులు లేకుండా అక్రమంగా మైనింగ్ పనులు చేపడితే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. తెలుగుగంగ కాలువ ఆక్రమణకు గురికాకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు అధికారులకు విన్నవించారు. కార్యక్రమంలో జిల్లా పొల్యూషన్ నివారణ అధికారి రాజశేఖర్, డీఎస్పీ కోటారెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

సోమశిలలో 10.090 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, జూన్ 26: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 392 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతోంది. డ్యాం పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా బుధవారానికి 10.090 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ఉప్పు భూముల లీజును రెన్యువల్ చేయాలి

● సాల్ట్ బోర్డు కమిషనర్‌కు రైతుల వినతి

అల్లూరు, జూన్ 26 : ఉప్పు భూముల లీజును రెన్యువల్ చేయాలని మండలంలోని ఇస్కపల్లి రైతులు సాల్ట్ బోర్డు కమిషనర్ (జైపూర్) ప్రేరణ జ్యోతిని వేడుకున్నారు బుధవారం ఆమె స్థానిక ఉప్పు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉప్పు రైతులు పడుతున్న ఇబ్బందులను తెలియజేయాలని కోరగా, ముందుగా తమ లీజు భూములను రెన్యువల్ చేయాలని కోరారు. ఆమె స్పందిస్తూ గతంలో ఇచ్చిన లీజు కాల పరిమితి 2013లోనే 20 ఏళ్లు పూర్తయ్యాయని, మరికొన్ని లీజులు 2027 నాటికల్లా పూర్తవుతాయన్నారు. ఈ విషయమై పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఆమె ఉప్పు భూములను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీవాస్తవ, ఫ్యాక్టరీ మేనేజర్ నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.



ఉప్పు భూములను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రేరణ జ్యోతి

'ఉపాధి' అవినీతి నిగ్గుతేలేనా?

- పనులపై తనిఖీలు ప్రారంభం
- సిబ్బంది గుండెల్లో గుబులు
- దొంగ మస్టర్లతో నిధుల స్వాహా

అనంతసాగరం, జూన్ 26: మండలంలో చేపట్టిన ఉపాధిహామీ పనులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసేందుకు 20మంది తనిఖీబృందం సభ్యులు అనంతసాగరంకు చేరుకున్నారు. ఈ మేరకు ఎన్ఆర్‌జీఎస్ అధికారులు వారికి రికార్డులు స్వాధీనం చేశారు. 25పంచాయతీలుండగా ఈ ఏడాది జరిగిన పనుల వివరాలతో తనిఖీ సిబ్బంది గ్రామాలకు చేరుకొని గ్రామసభలు నిర్వ హించి వివరాలు సేకరించి పనులు చేసిన ప్రాంతాలకు వెళ్లి పరిశీలన చేయనున్నారు. తాము చేసిన



ఉపాధి పనులపై సమీక్ష చేస్తున్న తనిఖీ బృందం

తప్పులు ఎక్కడ బయట పడుతాయోనన్న ఆలోచనతో ఉపాధి సిబ్బంది గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. పలు గ్రామాల్లో ఎక్కువ మొత్తంలో ఉపాధి నిధులు దుర్వినియోగం అయినట్లు తెలుస్తోంది. గత వైసీపీ పాలనలో నాయకుల అండతో ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు రెచ్చిపోయారు. పనులు చేయకనే చేసినట్లు రికార్డులు నమోదు చేశారని, పనులకు రాకపోయిన కొందరు వచ్చినట్లు దొంగ మస్టర్లు నమోదు చేసి నిధులు స్వాహా చేసినట్లు బహిరంగ ఆరోపణలు వినిపిస్తున్నారు. ఈ పరిస్థితిలో తమ అవినీతి బం డారం ఎక్కడ బయట పడుతుందో అని ఉపాధి సిబ్బంది హడలెత్తిపోతున్నారు. ఇక చేసేది లేక తనిఖీ బృందం సభ్యులను మచ్చిక చేసుకొనేలా ఉపాధి సిబ్బంది పావులు కదుపుతున్నారు. తనిఖీ కోసం వారికి మర్యాదలు చేసు కొని వారికి ఎంతో కొంత ఇచ్చి ఆ అవినీతిలో వారిని కూడా భాగ్యసా మ్యం చేసేలా జాగ్రత్తగా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితిలో సామాజిక తనిఖీ బృందం ఎలా అడుగులు వేస్తుందో వేచి చూడాలి. నిఖచ్చిగా పనుల్లో జరిగిన అవినీతి వెలికితీస్తారా? లేదా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. పనులు



కాలువ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

తనిఖీ చేసే సిబ్బంది ప్రలోభాలకు లొంగకుండా అవినీతి బహిర్గతం చేసేలా చర్య లు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పాఠశాలల తనిఖీ



విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ఎంఈవో జానకిరాం

అనంతసాగరం, జూన్ 26: మంగుపల్లి మొయిన్, గౌరవరం ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో-1 జానకీరాం బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. పలు ప్రశ్నలు అడిగి వారి నుంచి సమాధానాలు రాబట్టారు. మెనూ ప్రకారం భోజనం అందించేలా దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచనలిచ్చారు.

సామూహిక అక్షరాభ్యాసం



చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లులు

ఆత్మకూరు, జూన్ 26: కనుపూరుపల్లి ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులతో ఉపాధ్యాయులు, తల్లులు చిన్నారులకు సామూహిక అభ్యాసం చేయించారు. ముందుగా సరస్వతి పూజను నిర్వహిం చారు. తదనంతరం ప్రధానోపాధ్యాయుడు పి.అనిల్‌కు మార్ సొంత నిధులతో పలకులు, నోటుపుస్తకాలు, పెన్సిల్స్ తదితర విద్యాసామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు గుర్రం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మరమ్మతులకు నోచుకోని బోరు

ఆత్మకూరు, జూన్ 26: మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు ఎస్సీ కాలనీలో ఐదు నెలల నుంచి బోరు మరమ్మతులకు నోచుకోలేదని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వన్నెం నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు విన్నవించినా వారు స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వాటర్ ట్యాంకుల క్లీనింగ్



వాటర్ ట్యాంకులను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

సీతారామపురం, జూన్ 26: ఎంపీడీవో అబ్దుల్‌కలాం ఆజాద్ ఆదేశాలతో బుధవారం స్థానిక గ్రామపం చాయతీలోని హరిజనవాడ, పండ్రంగిలోని వాటర్ ట్యాంకులు క్లీనింగ్, పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు బుధవారం కార్యదర్శులు రామ్‌నాథ్‌రెడ్డి, జీవన్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి మాట్లాడారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు తాగు నీటిని వేడి చేసి వడగట్టి తాగాలన్నారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొని మురుగునీరు వీధుల్లోకి వెళ్లకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు నరశింహులు, ఓబులేసు, ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను పరిరక్షిద్దాం

ఉదయగిరి రూరల్, జూన్ 26: ప్రభుత్వ బడులను పరిరక్షించుకుందామని అందుకు ప్రతి తల్లిదండ్రులు పాఠశాలల్లో విద్యార్థులను చేర్పిద్దామంటూ యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కె.చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు సుబ్బారెడ్డి, ఫణిరాజా, దుర్గాప్రసాద్, రామకృష్ణ, పద్మనాభరెడ్డి, చెన్నకృష్ణయ్య, ఖాదర్‌బాష, రవి పాల్గొన్నారు.

సప్లిమెంటరీలో విద్యార్థుల ప్రతిభ

సీతారామపురం, జూన్ 26: బుధవారం విడుదలైన ఇంటర్ ఫస్ట్ ఇయర్ సప్లిమెంటరీ ఫలితాల్లో మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపల్ ఎస్ఎం రెహమాన్ ఒక ప్రకటలో పేర్కొన్నారు. మే నెలలో జరిగిన ఈ పరీక్షలకు హాజరైన 18 మంది ఉత్తీర్ణత సాధించిందన్నారు. బైపీసీ విభాగంలో నిరీష 440 మార్కులకు 423, ఎంపీసీ విభాగంలో ఎలిజ బెత్ 470 మార్కులకు 435, సీఈసీ విభాగంలో నాలి నాగశాలిని 500లకు 382మార్కులు సాధించారని తెలిపారు.

మాదక ద్రవ్యాలు వినియోగిస్తే జీవితాలు నాశనం

ఆత్మకూరు, జూన్ 26: మత్తు పదార్థాల వినియోగం ప్రాణాంతకం.. ఇది శరీరాన్ని మనకు తెలియకుండానే పీల్చి పిప్పి చేసి రోగాలపాలు చేస్తుంది. వీటికి అలవాటుపడితే మనిషి నాడీవ్యవస్థ పనితీరుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. యువత వీటి జోలికి వెళ్లకుండా ఉజ్వల భవితకు బాటలు వేసుకోవాలని సీఐ జి.వేణు తెలిపారు. బుధవారం ప్రపంచ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులతో కలిసి పోలీసు, సెబ్ అధికారులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి బీఎస్ఆర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి మాదకద్రవ్యాలపై యువత జాగ్రత్తగా ఉండాలని, మత్తుకు బానిస కావద్దంటూ నినాదాలో హోరెత్తిం చారు. కార్యక్రమంలో ఎస్ఐ ము త్యాల రావు, సెబ్ ఎస్ఐ కిరణ్‌కు మార్, అధ్యాపకులు, విద్యార్థులు, సెబ్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఆత్మకూరులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ఉదయగిరి: మత్తు పదార్థాలు వాడినా.. అమ్మినా చర్యలు తప్పవని ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి హెచ్చరించారు. బుధవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల అక్రమ రవాణా నివారణ దినోత్సవం సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి బస్టాండ్ వరకు ఈ ర్యాలీని కొనసాగించి అనంతరం మానవహారాన్ని ఏర్పాటు చేశారు. యువత గంజాయి మత్తుకు బానిసలు కావద్దన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడి తమ జీవి తాలను నాశనం చేసుకోవద్దని ని నాదాలు చేశారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సి పాల్ ఆకుల నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉదయగిరిలో ర్యాలీ చేస్తున్న పోలీసులు

వైసీపీకి.. ఇక భవిష్యత్తు ఉండదు!

- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబు

ఉదయగిరి రూరల్, జూన్ 26: సాధారణ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు చారిత్రాత్మక తీర్పు ఇచ్చి వైసీపీని బంగాళాఖాతంలో కలిపారని, ఆ పార్టీకి, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఇక రాజకీయ భవిష్యత్తు ఉండదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ అన్నారు. బుధవారం స్థానిక చెంచు రామయ్య అతిథిగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబునాయుడుపై రాష్ట్ర ప్రజలకు ఉన్న అపార నమ్మకంతోనే ఈ ప్రతిష్ఠాత్మకమైన తీర్పు సాధ్యమైందన్నారు. ఇప్పుడు కూడా తామే అధికారంలో ఉన్నామని భ్రమతో వైసీపీ నేతలు ప్రెస్‌మీట్‌లు పెట్టి లేనిపోని ఆరోపణలు చేస్తుండటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఐదేళ్ల పాలనలో పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రతిఒక్కర్ని వేధించారన్నారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. రాజధానిగా అమరావతి, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు చంద్రబాబు నడుంబిగించారన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ల ఆధ్వర్యంలో ఉదయగిరి అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బయ్యన్న, షేక్ మాబాషా, చల్లగొలుసు రమణయ్య, అరుణమ్మ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న చెంచలబాబు యాదవ్

బడిఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలి

ఆత్మకూరు, జూన్ 26: 2024-25 విద్యా సంవత్సరంలో బడిఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని ఐటీడీఏ ఏఎంవో శాంతకుమారి, ఉర్దూ డీఐ ఖాజామోహీద్దీన్ తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు సమగ్రశిక్ష, విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని మేదరకాలనీ, టెక్కే మైనార్టీ పాఠశాల ఆవాస ప్రాంతం, వందురుగుంట, మండలంలోని కరటంపాడు గిరిజన కాలనీలో నేను బడికి పోతా అనే కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎల్ఎస్ కో-ఆర్డినేటర్ సుబ్రహ్మణ్యంచ ఎంఈవో-2 చలపతి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆత్మకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

సీతారామపురం: స్థానిక హరిజనవాడలో నేను బడికిపోతా కార్యక్రమాన్ని ఎంఈఓ మస్తాన్‌వలి, సర్పంచ్ కొడవటికంటి భాగ్య కుమారి ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుడు, సీఆర్పీ వెంకటేశ్వర్లుతో కలసి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామాన్ని సందర్శించి బడి బయట పిల్లల వివరాలను సేకరించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వారి పిల్లలను పాఠశాలకు పంపిచాలని కోరారు. కార్యక్రమంలో సీతారామ పురం బిట్-2 వెల్ఫేర్ అసిస్టెంట్ నాగరాజు పాల్గొన్నారు.



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈవో మస్తాన్‌వలి

సైన్స్ ఉపాధ్యాయుడికి ప్రతిభా ప్రశంసాపత్రం

ఉదయగిరి, జూన్ 26: గడ్డంవారిపల్లి జిల్లా ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు షేక్ కరీముల్లాహుస్సేన్‌కు ప్రతిభప్రశంసా పత్రం దక్కింది. ఇటీవల భారత హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ మరియు మై గవర్నమెంట్ సంయుక్తంగా నిర్వహించిన భారతీయ నాగరిక్ సురక్ష సంహిత-2023 క్విజ్ కార్యక్రమంలో పాల్గొన్నందుకు ప్రతిభా ప్రశంసా పత్రం బుధవారం పోస్ట్ ద్వారా అందుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను ప్రధానోపాధ్యాయులు మాలకొండయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

నర్రవాడకు తరలిన భక్తులు

వరకుంటపాడు, జూన్ 26: నర్రవాడ వెంగమాంబ బ్రహ్మోత్సవాలకు బుధవారం మండలంలోని గ్రామాల ప్రజలు అధికసంఖ్యలో తరలివెళ్లారు. ఉత్సవా ల్లో ప్రధానంగా కల్యాణోత్సవం కావడంతో ఇతర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు చేరుకున్న వారు కుటుంబ సమేతంగా తరలివెళ్లి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. చాలా గ్రామాల నుంచి ప్రత్యేకంగా అలంకరించిన ఎద్దుల బండ్లతో దారి పొడవునా కన్పించారు.



కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

మాదక ద్రవ్యాలు వినియోగించినా, విక్రయించినా కఠిన చర్యలు : డీఎస్పీ

కావలి, జూన్26: మాదకద్రవ్యాలు వినియోగించినా, విక్రయించినా, రవాణా చేసినా, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఎం. వెంకటరమణ తెలిపారు. మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం కావలిలో ర్యాలీ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా నారాయణ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ కావలిలో గంజాయి విక్రయాలు, రవాణాపై గతంలో కొంతమందిపై కేసులు నమోదు చేశామన్నారు. ఎక్కడైనా వాటిని వినియోగిస్తున్నా, కలిగి ఉన్నా, కఠిన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐలు రాజేష్, శ్రీనివాసరావు, ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కందుకూరులో సెబ్ అధికారులు స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెబ్ ఇన్స్‌పెక్టరు డీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మాదకద్రవ్యాలు సేవించటం, కలిగి ఉండటం నేరమన్నారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఓ. వెంకటేశ్వరరావు, అధ్యాపకులు, సెబ్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కలిగిరి : స్థానిక ఏపీ మోడల్‌స్కూల్‌లో బుధవారం మాదకద్రవ్యాల వినియోగం అనే అంశంపై విద్యార్థులకు కలిగిరి సెబ్ స్టేషన్ హౌస్‌ఆఫీసర్ వై వెంకటేశ్వర్లు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు అలవాటుపడిన యువత చెడు మార్గంలో పయనించడానికి ఎక్కువ అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులు ఉన్నతంగా చదివి సంస్కారవంతులుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో సెబ్ సెబ్ సిబ్బంది సుధాకర్, గోపాలకృష్ణ, మాల్యాద్రి, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కావలి : డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు



కలిగిరి : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు



కందుకూరులో మాట్లాడుతున్న సెబ్ అధికారులు

గ్రామాల్లో తాగునీటి పరీక్షలు

అల్లూరు, జూన్ 26 : మండలంలోని అన్నీ పంచాయతీల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది బుధవారం తాగునీటి పరీక్షలు నిర్వహించారు. తాగునీటి క్లోరినేషన్‌పై అవగాహన కల్పించారు. ఎంపీడీవో జ్యోతి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొని తాగునీటి కుళాయిలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

- నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

అల్లూరు నగర పంచాయతీ పరిధిలోని ఆర్వో వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని నగర పంచాయతీ కమిషనర్ ఫణి కుమార్ అన్నారు. బుధవారం ఆయన పట్టణ పరిధిలోని కొన్ని వాటర్ ప్లాంట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా నీటి నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. నాణ్యతా లోపాలు ఉన్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈ వినోద్, ఆర్ఐ రమేష్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కాగా సీజనల్ వ్యాదులపట్ల అప్రమత్తంగా ఉండాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఐ.వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఎంపీడీవో జ్యోతి అధ్యక్షతలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులను అరికట్టాలంటే తాగునీటి సరఫరా, శుభ్రతపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర, ఏఈ రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.



అల్లూరు : పైపులైన్ వద్ద తాగునీటిని పరిశీలిస్తున్న పంచాయతీ సిబ్బంది

మంత్రులతో ఇంటూరి భేటీ



మంత్రి బాలాంజనేయ స్వామికి పుష్పగుచ్ఛం అందచేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, జూన్ 26: కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం రాష్ట్ర సచివాలయంలో పలువురు మంత్రులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర సాంఘిక, సంక్షేమం, సచివాలయాలు, వలంటీర్ల శాఖామంత్రిగా బుధవారం బాధ్యతలు స్వీకరించిన కొండపి ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయస్వామిని ఆయన చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. అలాగే రాష్ట్ర రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని, రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖామంత్రి కొల్లు రవీంద్రను కూడా కలిసి సన్మానించారు.

- మంత్రులను కలిసిన రాజేష్

టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్ బుధవారం సచివాలయంలో పలువురు రాష్ట్రమంత్రులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దనరెడ్డి, రెవెన్యూ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్, గనుల శాఖామంత్రి కొల్లు రవీంద్రలను కలిసి పుష్పగుచ్ఛాలు అందచేశారు.

కంప చెట్లు, చెత్తాచెదారం తొలగింపు

కావలి,జూన్26: పట్టణంలోని ముసునూరు రాగిచెట్టు గిరిజన కాలనీ నుంచి అండర్ బైపాస్ వరకు రోడ్డు పక్కన ముళ్లచెట్లు,చెత్తా చెదారాలను బుధవారం తొలగించారు. వీటి తొలగింపుపై ఆ ప్రాంత వాసులు కావలి ఎమ్మెల్యే కావ్య దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్‌కు చెప్పారు. దీంతో ఆయన ఎక్స్‌కవేటర్ ద్వారా రోడ్ల పక్కన ఉన్న కంపచెట్లను, చెత్తా చెదారాన్ని తొలగింపచేశారు. పట్టణంలో కూడా పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

లక్ష్మీపురం సర్పంచు మృతి

కలిగిరి : మండలంలోని లక్ష్మీపురం సర్పంచు దాసరి కొండమ్మ(77) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమెకు బుధవారం ఉదయం బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలు కనపడడంతో వెంటనే కావలి వైద్యశాలకు తరలించారు. అక్క డ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు.



కొండమ్మ (ఫైల్)

రేపు గురుకులంలో ప్రవేశ పరీక్ష

బిట్రగుంట : బోగోలు మండలం కప్పరాళ్లతిప్పలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మిగులు సీట్ల భర్తీకి శుక్రవారం ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎన్.పద్మావతి బుధవారం తె లిపారు. పాఠశాలలోని 6,7,9 తరగతుల్లో మిగులు సీట్లు ఉన్నందున, ఆసక్తి కలిగిన విద్యార్థులు ప్రవేశపరీక్ష రాయాలన్నారు. పూర్తి వివరాలకు 9440552944 నెంబరును సంప్రదించాలని తెలిపారు.

టీచర్ పోస్టులు పెరిగేలా కృషి

కావలిటౌన్ : జిల్లాలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టుల సంఖ్య పెరిగేలా కృషి చేస్తామని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం తుమ్మలపెంట రోడ్డులోని జనసేన కార్యాలయంలో నిరుద్యోగ యువకులు ఆయన్ను కలిసి మాట్లాడారు. అనంతరం వారు మాట్లాడుతూ కేబినెట్ ఆమోదం పొందిన మెగా డీఎస్సీలోని ఎస్జీటీ ఖాళీల సంఖ్య 104గా చూపిస్తున్నారన్నారు. అన్ని జిల్లాల్లోనూ ఎస్జీటీ ఖాళీల సంఖ్య పెరిగాయన్నారు. నెల్లూరు జిల్లాలో పెరగకపోవడంతో అభ్యర్థులు ఆందోళనకు గురౌతున్నారన్నారు. కాగా సుధాకర్ డీఈవోతో చరవాణిలో మాట్లాడి ఖాళీల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

వలేటివారిపాలెం : పశువులకు గుండె జబ్బులు రాకుండా ముందస్తుగా హెచ్ఎస్ టీకాలు వేయించాలని పోకూరు పశువైద్యాధికారి పులి వంశీ తెలిపారు. మండలంలోని గురుకుపాలెంలో పశువులకు బుధవారం టీకాలు వేశారు.

సీఎం, డిప్యూటీ సీఎంల చిత్రపటాల ఏర్పాటు



సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలు ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు

అల్లూరు, జూన్ 26 : ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, ఎమ్మెల్యే కావ్య చిత్రపటాలను బుధవారం టీడీపీ నేతలు ఆవిష్కరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జ్యోతి ఈ చిత్రపటాలను ఏర్పాటు చే శారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండి శ్రీనివాసులు రెడ్డి, అంబటి రాజేంద్ర, కారుమంచి కార్తీక్ శర్మ, తిరుమలశెట్టి శ్రీనివాసులు, తోట శ్రీహరి, ఎందేటి హరికృష్ణ, గుంజి రుద్రయ్య, దాసరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి ఘన సన్మానం

కొండాపురం, జూన్ 26: పదవీ విరమణ చేయనున్న సాయిపేట పంచాయతీ కార్యదర్శి ఎల్ చెన్నకేశవులను బుధవారం జడ్పీటీసీ సభ్యుడు యల్లావుల వెంకట్రావు, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈనెల 30న పదవీ విరమణ చేయుచున్న సందర్భంగా ముందస్తుగా ఈ కార్యక్రమాన్ని సచివాలయం వద్ద ఏర్పాటు చేశారు. సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు ఆయన సేవలను కొనియాడారు. శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. అలాగే వీఆర్వోగా పనిచేసి పదోన్నతిపై బదిలీ అయిన ప్రసాదరావును కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు టీ కోటేశ్వరమ్మ, కావలి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ జీ నరసింహులు, సాగునీటి సంఘ మాజీ అధ్యక్షుడు ఉన్నం రోశయ్య తదితరులు పాల్గొన్నారు.



చెన్నకేశవులను సన్మానిస్తున్న జడ్పీటీసీ యల్లావుల తదితరులు

బులియన్, కుదువ వ్యాపారుల సంఘం అధ్యక్షుల ఎన్నిక

కావలి,జూన్26: పట్టణ బులియన్ మర్చంట్స్ అసోసియేషన్, కుదువ వ్యాపారుల అసోసియేషన్‌ల సమావేశాన్ని బుధవారం కొత్తబజారులోని రామానుజ కూటమి కల్యాణ మండపంలో నిర్వహించారు. రెండు అసోసియేషన్లకు చెందిన వ్యాపారులు తమ సమస్యలపై చర్చించుకుని నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మొగళ్లపల్లి రాజాను, కుదువ వ్యాపార అసోసియేషన్ అధ్యక్షుడిగా కోట రమేష్‌లను ఎన్నుకున్నారు. త్వరలో జరగనున్న ప్రమాణ స్వీకారోత్సవం నాటికి పూర్తి స్థాయిలో కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని అధ్యక్షులు తెలిపారు.



మొగళ్లపల్లి రాజా, కోట రమేష్

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

కందుకూరు, జూన్ 26: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కందుకూరు ఉపవిద్యాశాఖాధికా రి(డీవైఈవో) ఎంవీ ప్రసాదరావు, ఎంఈవో కె. సుబ్బారెడ్డి అన్నారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోస్టాఫీసు సెంటర్‌లో మానవహారం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం. నరసింహమూర్తి, సీనియర్ ఉపాధ్యాయులు రమణయ్య, విప్రనారాయణ, ప్రసాదరావు, చిత్తారు వెంకటేశ్వర్లు, సుధాకరరావు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కావలి రూరల్ : బడి ఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలని ఎంఈవో గోవిందయ్య పేర్కొన్నారు. కావలి మండలం జువ్విగుంటపాలెం ఎంపీపీ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం నేను బడికి పోతా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, సీఆర్పీ తదితరులు పాల్గొన్నారు.

నేడు తైక్వాండో క్రీడాకారుల ఎంపిక

కందుకూరు, జూన్ 26: ఈనెల 30న విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొనే ఉమ్మడి ప్రకాశం జిల్లా తైక్వాండో బాలబాలికల ఎంపికలు గురువారం నిర్వహించనున్నట్లు తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్కే అబ్దుల్ సలాం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలు ఉదయం పది గంటలకు టీఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో జరుగుతాయన్నారు. 12 నుంచి 14 ఏళ్ల వయసు కలిగిన తైక్వాండో క్రీడాకారులు ఈ ఎంపికల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. క్రీడాకారులు ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ సర్టిఫికెట్లు తీసుకుని ఎంపికలకు హాజరుకావాలన్నారు.ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి



మనుబోలు, బుచ్చిలలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

మనుబోలు, జూన్ 26: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఎస్ఐ అజయ్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వ హించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైనా మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్నా, వాడుతున్నా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం: యువత మత్తుకు అలవాటుపడితే భవిష్యత్తు నాశనమేనని బుచ్చి సీఐ హైమారావు అన్నారు. బుచ్చిలోని ఎస్‌కేఆ ర్ఎస్ డీఎల్ ఎస్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులతో సీఐ హైమారావు సెబ్ సీఐ యశోదరాదేవి, ఎస్ఐలు రవి, ఆంజనేయులు, సిబ్బంది కళాశాల నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెబ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఆనంను కలిసిన ప్రజా సంఘాల నేతలు


మంత్రి ఆనంను కలిసిన నాయకులు

రాపూరు(డక్కిలి), జూన్ 26 : రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని పలువురు ప్రజాసంఘాల నేతలు బుధవారం నెల్లూరులోని ఆయన నివాసంలలో మర్యాద పూర్వకంగా కలిశారు. మాదిగ ఉద్యోగసమాఖ్య ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి దూడల పెంచలయ్య, మాదిగ ఉద్యోగ సమాఖ్య నియోజకవర్గ ఇన్‌చార్జి కిర్తీక్, జాల్లా ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ గద్దల మునెయ్యలు కలిశారు.

సోమిరెడ్డికి ఘన స్వాగతం

తోటపల్లిగూడూరు, జూన్ 26: సర్వేపల్లి శాసన సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి రాష్ట్ర అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం అనంతరం బుధవారం నెల్లూరుకు వచ్చిన సందర్భంగా తోటపల్లిగూడూరు మండల టీడీపీ నేతలు ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. నెల్లూరు రైల్వేస్టేషన్‌లో సోమిరెడ్డికి స్వాగతం పలికిన వారిలో తిరుపతి పార్లమెంటరీ టీడీపీ కార్యదర్శి కొణతం రఘుబాబు, ప్రధాన కార్యదర్శి ముత్యాల శ్రీనివాసులు, ఏపీ సర్పంచుల చాంబర్ కార్యదర్శి గోపిరెడ్డి వెంకటేశ్వర్లు, నియోజకవర్గ ముఖ్య నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

కిలారికి ఘన నివాళి

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 26: జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్‌గా కిలారి వెంకటస్వామినాయుడు సేవలు మరువలేనివని బుచ్చి గ్రంథాలయ అధికారిణి మంజులత పేర్కొన్నారు. బుధవారం వెంకటస్వామినాయుడు ఆకస్మిక మృతి సందర్భంగా బుచ్చి శాఖా గ్రంథాలయంలో వారు వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్సు సభ్యులు గండికోట సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

స్థల వివాదంపై విచారణ

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 26: రామచంద్రాపురంలో ఇద్దరి మధ్య తలెత్తిన స్థల వివాదాన్ని రెవెన్యూ అధికారులు బుధవారం విచారించారు. ఒక నివాసానికి చెందిన వారు తమకు రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నాయంటే, మరొకరు తమకు ప్రభుత్వం ఇచ్చిన పట్టాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. దీంతో ఏం చేయాలో దిక్కుతోచక ఆర్ఐ సాగర్, వీఆర్వోలు వెళ్లిపోయారు.


నేత్రదానం

విడవలూరు, జూన్ 26: విడవలూరుకి చెందిన బెజవాడ హేమలత (68) బుధవారం మృతి చెందారు. ఆమె నేత్రాలను మన సేవా సంస్థ నిర్వాహకులు దేవళ్ళ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో కుటుంబసభ్యులు దానం చేశారు. మృతురాలి నేత్రాలను మోడరన్ ఐ ఆసుపత్రి వైద్యులు నాగేశ్వరరావు సేకరించారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

రాపూరు(డక్కిలి), జూన్ 26: విద్యతోనే ప్రతిఒక్కరూ ఉన్నత శిఖరాలకు చేరుకోగలుగుతారని మాతృదేవి విశ్వశాంతి ఆశ్రమ మేనేజింగ్ డైరక్టర్ విజయభరత్ తెలిపారు. బుధవారం రాపూరు కరుణామయి పాఠశాలలోని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్టడీ మేటీరియల్, నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రమ శిక్షణ అలవర్చుకుంటే అనుకొన్న లక్ష్యానికి చేరుకోగలుగుతారన్నారు. విజయేశ్వరి అమ్మ పేదవిద్యార్థులకు అన్ని వసతులతో పాఠశాలను ఏర్పాటు చేసి ఉచితంగా విద్యనందిస్తున్నారని చెప్పారు. ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం శంకరయ్య , ప్రిన్సిపాల్ వెంకటరాయుడు ఉన్నారు.

గని కార్మికుల శ్రేయస్సు ముఖ్యం


మైన్‌లో మొక్కలు నాటుతున్న డీఎంఎస్ పెద్దిరెడ్డి

సైదాపురం, జూన్ 26: గని కార్మికుల శ్రేయస్సు ముఖ్యమని నెల్లూరు రీజియన్ డిప్యూటీ మైన్స్ సేఫ్టీ అధికారి రఘుపతి పెద్దిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని గంగమ్మ మైన్‌లో జరిగిన 50వ నెల్లూరు గనుల భద్రతా వారోత్సవాల్లో భాగంగా డీఎంఎస్ రఘుపతి పెద్దిరెడ్డి గంగమ్మ మైన్‌ను పరిశీలించారు. గని పరిసరాలను పరిశీలించి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గనుల్లో అశ్రద్ధతో వ్యవహరిస్తే కార్మికులు ప్రమాదాలకు గురవుతున్నారని వాపోయారు. మేనేజర్లు పరిశీలించిన అనంతరం కార్మికులు పని చేయాలన్నారు. జిల్లాలో మైకా, క్వార్ట్జ్, ఫెల్స్‌పర్, సిలికా, రోడ్డు మెటల్‌తో కలిపి మొత్తం 50మైన్‌లల్లో భద్రత వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 30న భద్రతవారోత్సవాలు ముగుస్తాయన్నారు. మైనింగ్ కార్మికులకు గనుల భద్రతా వారోత్సవాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మైనింగ్ ఓనర్ సురేష్‌రెడ్డి, గనుల పరిశీలన బృందాలు పాల్గొన్నారు.

గురుకులంలో మిగుల సీట్ల భర్తీకి రేపు ప్రవేశ పరీక్ష

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 26: మండలంలోని రామచంద్రాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 6, 7 తరగతులలో మిగిలివున్న సీట్లు భర్తీ కోసం ఈనెల 28వ తేదీ ఉదయం ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు స్కూలు ప్రిన్సిపాల్ కే జయలక్ష్మి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈమేరకు ఆసక్తిగల విద్యార్థులు 27వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవు

● ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి


ఆక్రమిత భూమిని పరిశీలిస్తున్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం, జూన్ 26: ప్రభుత్వ భూములు ఎవరు ఆక్రమించినా చర్యలు తప్పవని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలో ఎగువమిట్ట గ్రామంలో వైసీపీ నేతలు ప్రభుత్వ భూమితోపాటు రోడ్డు మార్జిన్‌ని సైతం ఆక్రమించి ఫెన్సింగ్ వేసే ప్రయత్నం చేశారు. బుధవారం సాయంత్రం ఎగువమిట్ట గ్రామానికి వచ్చిన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి విషయాన్ని గ్రామస్థులు తీసుకువెళ్లి ఫిర్యాదు చేశారు. దీంతో ఆక్రమిత భూమిని సోమిరెడ్డి గ్రామస్థులతో కలిసి పరిశీలించారు. వెంటనే ఆక్రమణ తొలగింపునకు చర్యలు తీసుకోవాలని అధికారులను సోమిరెడ్డి ఆదేశించారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

టీడీపీ నేతలు, కార్యకర్తలకు అండగా ఉంటానని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఎగువమిట్ట గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత పల్లిపాటి మునీంద్ర బాబు మూడురోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో సోమిరెడ్డి బుధవారం మృతుడి నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సోమిరెడ్డిపై అసత్య ఆరోపణలు సహించం

మనుబోలు: సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని టీడీపీ మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్కంపేట సచివాలయంలో సామాజిక పింఛన్ల విచారణపై కొంతమంది అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. దళితుల పింఛన్లు తీసేయాలని చూస్తున్నారని, సోమిరెడ్డి దళితద్రోహి అంటూ సోషల్‌మీడియాలో ప్రచారం చేస్తున్నారన్నారు. దళిత ద్రోహులు మేము కాదని, మీరేనని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పొన్నూరు రామకృష్ణయ్య, నాయకులు వెందోటి భాస్కర్‌రెడ్డి, నూనె లక్ష్మయ్య, కృష్ణమనాయుడు, నాగేశ్వరరావు, సునీల్‌కుమార్‌నాయుడు పాల్గొన్నారు.

ఉప్పు రైతుల వినూత్న నిరసన

● ఖాళీ కుర్చీకి వినతిపత్రం ● కమిషనర్‌పై ఆగ్రహం


ఖాళీ కుర్చీకి వినతిపత్రం ఇస్తున్న ఉప్పు రైతులు

ముత్తుకూరు, జూన్ 26: గోపాలపురంలో బుధవారం ఉప్పు రైతులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. కృష్ణపట్నం సాల్ట్ ఫ్యాక్టరీ పరిధిలోని ఉప్పు రైతులతో సాల్ట్ కమిషనర్ ప్రేరణ జోషి సమావేశం అవుతారని అధికారులు తెలిపారు. ఉదయం 11గంటలకు కమిషనర్ వస్తారని చెప్పడంతో రైతులు స్థానిక సాల్ట్ ఫ్యాక్టరీ వద్ద సమావేశం అయ్యారు. కమిషనర్ రాక కోసం ఎదురు చూశారు. గోపాలపురం మీదుగా సాల్ట్ కమిషనర్ పోర్టుకి వెళ్లడం రైతుల దృష్టికి వచ్చింది. దీంతో మొదట భోజనం కోసం వెళ్లారని రైతులు మధ్యాహ్నం 3 గంటల వరకు ఎదురు చూశారు. కమిషనర్ రాకపై ఎటువంటి సమాచారం రాకపోవడంతో ఆగ్రహించిన ఉప్పు రైతులు తాము తీసుకువచ్చిన శాలువా, పూలమాలతో ఖాళీ కుర్చీని సన్మానించి కుర్చీకి వినతిపత్రం అందజేశారు. పక్కనే ఉన్న నాగులపుట్టకు పూలమాలలు వేసి అధి కారులు నిర్లక్ష్యం వీడాలని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పు రైతులు పాల్గొన్నారు.

అతిసార నివారణపై అవగాహన సదస్సు

ఇందుకూరుపేట, జూన్ 26: మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిషోర్‌కుమార్, డాక్టర్ బ్రహ్మేశ్వరనాయుడు ఆధ్వర్యంలో లేబూరు బిట్-2 సచివాలయం పరిధిలోని వైద్య సిబ్బంది, ఆశా వాలంటీర్లు, అంగన్‌వాడీ సిబ్బందికి హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు అతిసార వ్యాధి నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. అతిసార వ్యాధి నుంచి ప్రధానంగా పిల్లలను కాపాడుకోవాలని సూచించారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని, కాచి చల్లార్చిన నీరు తాగేలా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ డి వెంకటేశ్వర్లు, హెచ్ఓ శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్ సతీష్‌బాబు, ఉపాధ్యాయులు షాహుల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ, ఏఎన్ఎం కల్పవల్లి, హెల్త్ సెక్రటరీ ధనలక్ష్మీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వెంకటేష్, మహిళా పోలీస్ విజయలక్ష్మీ పాల్గొన్నారు.

పొదలకూరు: పట్టణంలోని నాగార్జున హైస్కూల్‌లో బుధవారం స్థానిక వైద్యాధికారులు అతిసార వ్యాధి నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పి మణిచందన, స్థానిక ఆరోగ్య విస్తరణ అధికారి రవికుమార్, సచివాలయ కార్యదర్శి పఠాన్ షఫీ, వెల్ఫేర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, కరస్పాండెంట్ సునీతారెడ్డి పాల్గొన్నారు.

పిల్లలను పాఠశాలలకు పంపించాలి

వెంకటాచలం, జూన్ 26: మండలంలోని నిడిగుంటపాళెం ప్రభుత్వ పాఠశాలలో బుధవారం నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల కమిటీ, సచివాలయ, విద్యాశాఖ సిబ్బంది ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. పిల్లలను పాఠశాలలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. అలాగే కురిచెర్లపాడులో కూడా తల్లిదండ్రులను కలిసి పిల్లలను బడికి పంపించాలని కోరారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు కే మధుసూదన్, వీ శ్రీనివాసులురెడ్డి తదితరులున్నారు.

పొదలకూరు : పట్టణంలో బుధవారం హైస్కూల్ విద్యార్థులు నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికోన్నత పాఠశాలల విద్యార్థులు రామ్‌నగర్ సెంటర్ నుంచి పంచాయతీ బస్టాండు వరకు ర్యాలీ చేపట్టి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజే రామారావు, ఉప విద్యాశాఖ అధికారి ప్రసన్నలక్ష్మీ, ఎంఈవోలు రేణుక, శోభనాద్రి, బాలుర, బాలికోన్నత పాఠశాలల హెడ్మాస్టర్‌లు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొలం ఆక్రమణపై ఆర్డీవోకు ఫిర్యాదు


మాట్లాడుతున్న మొగళ్లపల్లి సుభాషిణి కుటుంబ సభ్యులు

ఇందుకూరుపేట, జూన్ 26: తన పొలాన్ని దౌర్జన్యంగా ఆక్రమిస్తున్నారని మండలంలోని కొత్తూరులో నివాసం ఉంటున్న మొగళ్లపల్లి సుభాషిణి ఆర్డీవోను కలిసి మొరపెట్టుకుంది. మండలంలోని కొత్తూరులో ఎల్‌పి నెంబరు 580లో 2 ఎకరాల 15 సెంట్లు భూమి, ఎల్‌పి నెంబరు 672లో 1 ఎకరా మాగాణి భూమి ఉందని, ఆ భూమి తామే సాగు చేస్తున్నామని, భూమి తమ పెద్దల నుంచి సంక్రమించిందని బుధవారం ఇందుకూరుపేట తహసీల్దారు కార్యాలయం ఎదుట బాధితురాలు మొగళ్లపల్లి సుభాషిణి మీడియాకు తెలిపారు. ఎల్‌పి నెంబరు 672లోని ఎకరా భూమిని లేబూరు సుధీర్‌రెడ్డి అనే వ్యక్తి డాక్యుమెంట్లు సృష్టించి దౌర్జన్యంగా ఆక్రమించాలని చూస్తున్నాడని, ఎమ్మార్వోకి ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఆయన పట్టించుకోలేదని వారు వాపోయారు. ఈ విషయమై ఆర్డీవోను కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని ఆయన దృష్టికి తీసుకుపోగా వెంటనే స్పందించిన ఆర్డీవో తహసీల్దారుతో మాట్లాడి రికార్డులలో ఎలాంటి మార్పులు చేర్పులు చేయొద్దని సూచించినట్లు తెలిపారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

నెల్లూరు నగర నియోజకవర్గంలో గడిచిన ఐదేళ్లలో కార్పొరేషన్ నిధులతో జరిగిన పనులేవి?, ఎక్కడెక్కడ నిర్వహించారు?, వాటి నాణ్యత ఎలా ఉంది?. గడిచిన ఏడాది కాలంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 26 డివిజన్లలో ఎన్ని పనులు చేశారు?, వాటిలో నామినేటెడ్ వర్కులెన్ని? టెండర్ల ద్వారా జరిగిన పనులెన్ని?, ఈ పనులకు చెల్లించిన మొత్తం ఎంత? అందులో లోపాలేమిటి..?. ప్రస్తుతం నగర పాలక సంస్థలోని ఇంజనీరింగ్ విభాగంలో ఈ ప్రశ్నలు అధికారులను కుదిపేస్తున్నాయి.

ఆ ఫైళ్లు ఉన్నాయా!?

● వైసీపీ హయాంలో జరిగిన వర్కులపై ఆరా
● నామినేటెడ్, టెండరు పనులే లక్ష్యంగా కూపీ
● నాణ్యతలో డొల్ల పనుల గుర్తింపునకు అన్వేషణ


కనీసం

నెల్లూరు(సిటీ), జూన్ 26 : నగర పాలక సంస్థ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన వివిధ రకాల పనులకు సంబంధించి ఫైళ్లు ఎక్కడున్నాయంటూ తాజాగా అన్వేషణ జరుగుతుండటంతో కాంట్రాక్టర్లతో పాటు ఇంజనీరింగ్ అధికారుల్లో గుబులు రేగుతోంది. జగన్ సర్కారు అధికారంలో ఉన్నప్పుడు వైసీపీ నాయకులు విచ్చలవిడిగా అభివృద్ధి పేరిట ఎడాపెడా పనులు చేశారు. అందులో సీసీరోడ్లు, కల్వర్టులు, డ్రైన్లు, సుందరీకరణ పనులున్నాయి. వీటిల్లో భారీగా అవినీతి జరిగిందని నాటి నుంచి ఆరోపణలు గుప్పుమంటున్నా అధికారులెవ్వరూ కనీసం చర్యలు తీసుకోకపోగా, విచారణ కూడా చేపట్టలేదు. అప్పట్లో ప్రతిపక్షంగా ఉన్న టీడీపీ నాయకులు లిఖితపూర్వంగా అధికారులకు లేఖలు అందించినా పట్టించుకోలేదు. తీరా టీడీపీ అధికారంలోకి రావడంతో వైసీపీ పాలనలో జరిగిన పనులపై టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆరా తీస్తున్నారు. విచ్చలవిడిగా నిర్వహించిన పనులు, అందులోని డొల్లతనం, అంచనాలకు మించి జరిగిన ఆర్థిక చెల్లింపులు, కనీసం వర్కు ఆర్డర్ లేకుండానే జరిగిన పనులేంటి? ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా చేపట్టిన పనులేంటి.. అన్న కోణంలో లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఇలాంటి పనులను గుర్తిస్తున్న పార్టీ నాయకులు వాటి తాలుకూ వివరాలు కోరుతూ ఇంజనీరింగ్ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. నెల్లూరు సిటీలో ఇలాంటి పనులు కోకొల్లలుగా జరగగా, రూరల్లో అవసరం లేకుండానే కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసం కొన్ని పనులను చేశారు. వాటి వివరాలు సేకరణ జరుగుతుండటంతో అటు వైసీపీ నాయకులతో పాటు ఇటు ఇంజనీరింగ్ అధికారుల్లో ఆందోళన మొదలైంది. వైసీపీ హయాంలో జరిగిన అనేక పనులపై రెండు నియోజకవర్గాల్లో విజిలెన్స్ విచారణ జరుగుతుందన్న సమాచారంతో కొందరు ఏఈలు ఫైళ్లను కనపడకుండా చేశారన్న వాదనలు వ్యక్తమవుతోన్నాయి. ఇటీవల 2వ డివిజన్‌లో సుమారు రూ.20 లక్షల పనులకు సంబంధించి ఫైళ్ల మాయమవడాన్ని ఆంధ్రజ్యోతిలో వెలుగులోకి తీసుకురావడంతో దృష్టి సారించిన ఉన్నతాధికారులు విచారణ చేపట్టడంతో అవి బయటకు వచ్చాయి.

కార్టికల్ వెయిన్ త్రొంబోసిస్‌కు ఆధునాతన శస్త్ర చికిత్స



మాట్లాడుతున్న డాక్టర్ లావణ్య

నెల్లూరు(వైద్యం), జూన్ 26: నగరంలోని ఎనెల్ ఆసుపత్రిలో కార్టికల్ వెయిన్ త్రాంబో సిస్ అనే వ్యాధికి అత్యాధునిక శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు మెదడు, నర ముల వైద్య నిపుణులు డాక్టర్ లావణ్య తెలిపారు. బుధవారం ఆసుపత్రిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ నెల్లూరు నగరానికి చెందిన సారమ్మ (43) తీవ్రమైన తలనొప్పి, ఎడమ చేయి బలహీనపడటం వంటి సమస్యలతో ఎనెల్ ఆసుపత్రికి వచ్చారన్నారు. ఆమెకు పూర్తిస్థాయి పరీక్షలు నిర్వ హించగా కార్టికల్ వెయిన్ త్రాంబోసిస్ అనే వ్యాధి ఉన్నట్లు గుర్తించామన్నారు. దీంతోపాటు ప్లేట్ లెట్‌లు 10వేలకు తగ్గిపోయాయని చెప్పారు. ఈ రెండు కలిసి ఉండటం చాలా అరుదని, బాధితు రాలికి ప్రాణాలు పోయే అవకాశం ఉండగా చాలా జాగ్రత్తగా శస్త్రచికిత్సను నిర్వహించి విజయ వంతం చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాధితురాలు సారమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వల్ల కుటుంబాల విచ్ఛిన్నం

● ఏఎస్పీ సౌజన్య, ప్రిన్సిపాల్ వసుంధరాదేవి

నెల్లూరు(వైద్యం), జూన్ 26 : మాదక ద్రవ్యాల వల్ల కుటుంబాలు విచ్ఛిన్నమయ్యే అవకాశం ఉందని జిల్లా ఏఎస్పీ సౌజన్య ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం ప్రభుత్వ వైద్య కళాశాలలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వాడే వారికి శిక్షలు తప్పవన్నారు. మాదక ద్రవ్యాల నిరోధానికి పోలీసులు గట్టి కృషి చేస్తున్నారని తెలిపారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసుంధరాదేవి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వాడకంతో తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వాడకం వల్ల మనిషి ఆరోగ్యంతో పాటు మానసిక సమస్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులరెడ్డి, సీఐ అల్తాఫ్, జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ శాంతిశ్రీ, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కళారాణి తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు యువత దూరంగా ఉండాలి : ఏడీఎంహెచ్‌వో

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి హెచ్చరించారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నవజీవన్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ ఆర్గనైజేషన్ నిర్వాహకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు అభినందనలు


స్పీకర్‌కు అభినందనలు తెలుపుతున్న వేమిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), జూన్ 26 : లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికైన ఓం బిర్లాకు ఆయన చాంబర్‌లో బుధవారం నెల్లూరు పార్లమెం టు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ ఎంతో అనుభవం ఉన్న ఓంబిర్లా రెండోసారి స్పీకర్‌గా ఎన్నిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 26 : నగరంలోని మూలాపేట అన్నదేవుల గోవిందరెడ్డి, సరస్వతీ సమాజంలో గురువారం ఉదయం 10 గంటలకు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్లు సమాజం అధ్యక్షుడు మోపూరు పెంచలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ మేయర్ పొలుబోయిన రూప్‌కుమార్‌యాదవ్, డాక్టర్ కరిమద్దెల నరసింహారెడ్డి, విశ్రాంత మండల విద్యాశాఖాధికారి పి.అమర్‌నాథ్‌సింగ్‌లు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు సమాజం సభ్యులు అందరూ తరలిరావాలని కోరారు.

డైకాస్ రోడ్డులో రక్తదానం, అన్నదానం

నెల్లూరు(వైద్యం), జూన్ 26 : తెలుగుదేశం పార్టీ జిల్లా మైనార్టీ నేత ఆసిఫ్‌బాషా ఆధ్వర్యంలో ఆయన పుట్టిన రోజు సందర్భంగా బుధవారం రక్తదానం, అన్నదానం చేశారు. నెల్లూరు నగరంలోని డైకాస్ రోడ్డు సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో యువత రక్తదానం చేయగా స్థానిక ప్రభుత్వ ఉన్న పాఠశాలలో విద్యార్థులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు షేక్ వాహిద్, షేక్ అస్లామ్, రషీద్, సయ్యద్ రబ్బాని, నసీర్, షేక్ ఫాజిల్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌గా రాహుల్



నెల్లూరు(విద్య), జూన్ 26 : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జిల్లా కన్వీనర్‌గా కర్లపూడి రాహుల్ నియమితులయ్యారు. తిరుపతిలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమశేఖర్ అధ్యక్షతన జరిగిన ఏబీవీపీ ప్రాంత అభ్యాసవర్గలో రాహుల్‌ను కొత్త కన్వీనర్‌గా ప్రకటించారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్రశాఖ నమ్మకాన్ని వమ్ము చేయకుండా సేవలందిస్తానన్నారు. అందరి సహకారంతో విద్యారంగ సమస్యలపై పోరాటం చేస్తూ విద్యార్థులకు అండగా ఉంటామని తెలిపారు. అనంతరం రాహుల్‌ను జిల్లా కమిటీ నేతలు, రాష్ట్ర నేతలు అభినందించారు.

ఉచిత కంటి శస్త్రచికిత్సలకు విరాళం

నెల్లూరు(వైద్యం), జూన్ 26 : నగరంలోని జయభారత్ ఆసుపత్రిలో బుధవారం జరిగిన ఉచిత కంటి శస్త్ర చికిత్సలకు దాత పొన్నలూరు వినయ్ రాఘవన్ తన పుట్టిన రోజు సందర్భంగా రూ.50 వేల విరాళం అందించారు. దీంతో 25 మందికి కంటి శస్త్ర చికిత్సలు చేసినట్లు ఆసుపత్రి జనరల్ మేనేజర్ గురుప్రసాద్ తెలిపారు. ఉచిత కంటి శస్త్రచికిత్స చేయించుకున్న వారికి కంటి అద్దాలతో పాటు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీలక్ష్మి, డిప్యూటీ జనరల్ మేనేజర్ వెంకటేష్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

29న డీకేడబ్ల్యూలో ఉద్యోగమేళా


నెల్లూరు(విద్య), జూన్ 26 : నగరంలోని డీకేడబ్ల్యూ కళాశాలలో ఈనెల 29వ తేదీన ఇంటర్‌బోర్డు, హెచ్‌సీఎల్ టెక్‌బీ సంయుక్త ఆధ్వర్యంలో ఇంటర్ విద్యార్థులకు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ఆర్ఐవో డాక్టర్ ఏ.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 సంవత్సరంలో ఇంటర్‌లో 75 శాతం ఉత్తీర్ణత కలిగిన అన్ని గ్రూపుల విద్యార్థులు (మ్యాథ్స్ మినహా) మేళాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. పేర్లు నమోదు చేసుకున్న అభ్యర్థులకు కాట్ పరీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు. సీఈసీ, హెచ్ఈసీ, బైపీసీ, ఒకేషనల్ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు హెచ్‌సీఎల్‌లో తమ కెరీర్‌ను ప్రారంభించేందుకు నిర్దేశించిన ఉత్తమ ప్రోగ్రామని పేర్కొన్నారు. ఇందులో ఎంపికైన వారికి ఇంటర్వ్యూ నిర్వహించి అర్హులైన వారికి హెచ్‌సీఎల్ టెక్‌బీ ప్రోగ్రాంలో చేరేందుకు ఆఫర్ లెటర్ అందిస్తారని పేర్కొన్నారు. ఈ ప్రోగ్రాంకు ఏడాది పాటు కాలపరిమితి ఉంటుందని, తొలి 3 నెలలు మధురైలో తరగతి గదిలో శిక్షణ, మిగిలిన 9 నెలలు అభ్యర్థి ఇంటర్న్‌షిప్ కోసం చెన్నై హెచ్‌సీఎల్ క్యాంపస్‌కి వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. ఇంటర్న్‌షిప్ సమయంలో నెలకు రూ.10వేలు స్టైఫండ్ అందచేస్తారని పేర్కొన్నారు. ట్రైనింగ్ పూర్తి చేసిన వారికి ఏడాదికి రూ.1.70 లక్షల జీతం పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హత కలిగిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలకు 7780323850ను సంప్రదించాలని తెలిపారు.

వేలం నిధులు దర్గా అభివృద్ధికే.. : మంత్రులు

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 26 : బారాషహీద్ దర్గా, ఇతర చిన్న దర్గాలు, దుకాణాలు, రొట్టెల పండుగ సందర్భంగా ఏర్పాటు చేసే దుకాణాల నుంచి అద్దెలు వసూలు చేసుకునేందుకు ప్రతి ఏటా రాష్ట్ర వక్ఫ్‌బోర్డు వేలం పాటలు నిర్వహిస్తోందని రాష్ట్ర మంత్రులు పొంగూరి నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఈ ఏడాది వేలం పాట ద్వారా రాష్ట్ర వక్ఫ్‌బోర్డుకు రూ.1.57 కోట్లకు పైగా ఆదాయం వచ్చిందన్నారు. ఆ నిధులను దర్గా అభివృద్ధికి ఖర్చు చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వక్ఫ్‌బోర్డు అధికారులతో మాట్లాడుతున్నామన్నారు. ఈ నిధులు వెచ్చించేందుకు తమను లేఖ రాయమని వక్ఫ్‌బోర్డు కోరిందన్నారు. ఒకటి, రెండు రోజుల్లో ఒక కొలిక్కి వస్తుందని తెలిపారు. ఆ నిధులు వస్తే దర్గాలో అభివృద్ధి పనులు పూర్తి కావడమేకాక 365 రోజులు ఈ ప్రాంతం ఆధ్యాత్మిక కేంద్రంగా మారుతుందని తెలిపారు.

ఎమ్మెల్యే కోటంరెడ్డికి సన్మానం

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 26 : శాసన సభకు 3వ సారి ఎన్నికై హ్యాట్రిక్ సాధించిన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని నెల్లూరు జిల్లా నాయీబ్రాహ్మణ ఎంప్లాయీస్ సొసైటీ కార్యవర్గం బుధవారం ఘనంగా సన్మానించింది. సొసైటీ ప్రధాన కార్యదర్శి వినుకొండ వెంకటేశ్వర్లు, కోశాధికారి ఆర్ ప్రభాకర్‌రావు, ఉపాధ్యక్షుడు బాల కేశవులు తదితరులు పాల్గొన్నారు.



కొత్త ఎమ్మెల్యేల తొలి ప్రాధాన్యం



అభివృద్ధికి తిలోదకాలిచ్చిన వైసీపీని ఓట్ల ఉప్పెన ఊడ్చేసింది. తెలుగుదేశం కూటమికి తిరుగులేని అధికారం ఇచ్చింది. అరాచకాన్ని, విధ్వంసాన్ని సహించని జనం అభివృద్ధి కోసమే ఈ తీర్పునిచ్చారు. దెబ్బతిన్న రోడ్లు, మరమ్మతులకు నోచుకోని చెరువులు, మురికి కూపాలుగా మారిన పట్టణాలు, సాగు, తాగు నీటి పై నిర్లక్ష్యం.. జిల్లాలో ఎటుచూసినా దయనీయ వాతావరణం కనిపిస్తోంది. అప్పులకుప్పగా మార్చి అప్పగించిన రాష్ట్రంలో ప్రతిదీ చక్కదిద్దుకోవడం అంత సులభమేమీ కాదు. ఎన్నికల ప్రచారాల్లో హామీలు ఇచ్చి గెలిచిన శాసనసభ్యులకు అభివృద్ధే పెద్ద సవాలు. శ్రద్ధ, లౌక్యం, ప్రణాళికాబద్ధమైన ప్రాధాన్యాలతో ప్రతి అడుగూ వేయాలి. అన్ని పనులూ ఏకకాలంలో అసాధ్యం. అందుకే కొత్త ఎమ్మెల్యేల తొలిప్రాధాన్యాలు ఏమిటో తెలుసుకునే ప్రయత్నం ఆంధ్రజ్యోతి చేసింది. అభివృద్ధి ఆకాంక్షలతో ఎదురుచూస్తున్న ప్రజలకు వాటిని అందిస్తున్నాం... - తిరుపతి,ఆంధ్రజ్యోతి

గూడూరు

తిరిగి నెల్లూరు జిల్లాలోకి

గూడూరు నియోజకవర్గాన్ని తిరిగి నెల్లూరు జిల్లాలో కలపడమే ముఖ్య అజెండాగా పెట్టుకున్నా. సీఎం చంద్రబాబు కూడా దీనిపై స్పష్టమైన హామీ ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా జిల్లాలను విభజించి గూడూరు ప్రజలకు తీరని వేదన మిగిల్చింది. ప్రస్తుత జిల్లా కేంద్రమైన తిరుపతికి వెళ్లాలంటే వంద కిలోమీటర్లు ప్రయాణించాలి. అదే నెల్లూరు అయితే 35 కిలోమీటర్ల చేరువలో వుంది. దీనికోసం గట్టిగా కృషి చేసి త్వరలోనే గూడూరు ప్రజలకు శుభవార్త వినిపించేందుకు ప్రయత్నిస్తున్నా.


పాశం సునీల్ కుమార్

సత్యవేడు

రోడ్లు బాగు చేస్తా

సత్యవేడు నియోజకవర్గంలో ఆర్ అండ్ బీ రోడ్ల పరిస్థితి దారుణంగా వుంది. వాటిని బాగుపరచడమే నా తొలి ప్రాధాన్యత. గత ప్రభుత్వంలో నియోజకవర్గంలోని 33 రోడ్ల పనులకు టెండర్లు పిలిస్తే పీఎల్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ తరపున టెండర్లు దక్కించుకుని పది పనులు మాత్రమే చేపట్టి మిగిలినవి వదిలేశారు. చేపట్టిన పనుల్లో కూడా కొన్ని ఇంకా పెండింగ్‌లోనే వున్నాయి. ఆ టెండర్లను రద్దు చేసి కొత్తగా పిలిచి పనులు చేపట్టాలి. సంబంధిత మంత్రితో మాట్లాడి త్వరగా పనులు మొదలు పెట్టడానికి ప్రయత్నిస్తా.


కోనేటి ఆదిమూలం

శ్రీకాళహస్తి

ముక్కంటి ఆలయ ప్రక్షాళన

శ్రీకాళహస్తీశ్వరాలయ పాలనను ప్రక్షాళన చేయడం నా తొలి ప్రాధాన్యత. ఆలయంలో దళారీ వ్యవస్థ, అధికార యంత్రాంగంలో అవినీతి పాతుకుపోయాయి. గెలిచిన మరుసటి రోజే ఆలయంలో అవినీతికి పాల్పడిన అధికారులను ప్రాధాన్యత లేని విభాగాలకు బదిలీ చేయించా. అడ్డదారి దర్శనాలకు అడ్డుకట్ట వేశా. దాతల సాయంతో ఆలయంలో శిల్ప సౌందర్యంతో కూడిన స్తంభాలకు స్వర్ణ తాపడం చేయించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం.ముక్కంటీశుడి దర్శన సేవలన్నింటినీ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో అందించేందుకు కసరత్తు చేస్తున్నాం.ఆలయానికి అదనపు ఆదాయం కోసం రాహుకేతు పూజల్లో వీవీఐపీల కోసం కొత్తగా 7 వేల రూపాయల టికెట్ ప్రవేశపెడుతున్నాం.


బొజ్జల సుధీర్‌రెడ్డి

వెంకటగిరి

పార్క్‌గా పోలిశెట్టి గుంట

వెంకటగిరి పట్టణంలో ఇప్పటి వరకూ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే పార్కు లేదు. పోలిశెట్టి గుంట ఒకప్పుడు మంచినీళ్ళ కుంట.ఊటబావి వుండేది. మొత్తం పూడిపోయింది. గతంలో పూడిక తీతకు, పార్కు ఏర్పాటుకు ప్రయత్నం జరిగినా సఫలం కాలేదు.ఇపుడు దానిపై దృష్టి పెడుతున్నాం.పూడిక తొలగించి తెలుగు గంగ నీటిని మళ్ళించి కుంటను నింపాల్సి వుంది. అందులో బోటింగ్, కుంట చుట్టూ పార్కు ఏర్పాటు చేస్తాం. పార్కులో వాకింగ్ ట్రాక్ నిర్మిస్తాం. ఆరు నెలల్లో పోలిశెట్టి గుంట రూపురేఖలు మార్చడాన్ని తొలి ప్రాధాన్యంగా పెట్టుకున్నా.


కురుగొండ్ల రామకృష్ణ

సూళ్లూరుపేట

పేట పట్టణాలకు తాగునీరు

సూళ్ళూరుపేట, నాయుడుపేట పట్టణాలకు శాశ్వత ప్రాతిపదికన తాగునీటిని అందించడం నా ప్రథమ ప్రాధాన్యం. దీనికోసం ఆరు నెలల ప్రణాళిక సిద్ధం చేసుకున్నా. అందులో భాగంగా కాళంగి నదిపై గ్రాయిన్ నిర్మించి సూళ్ళూరుపేటలో భూగర్భ జలాలు వృద్ధి చెందేందుకు చర్యలు తీసుకుంటా. గత టీడీపీ ప్రభుత్వం సూళ్ళూరుపేటకు తాగునీటి సరఫరా కోసం రూ. 162 కోట్లు మంజూరు చేసింది. ఆ పనులు పూర్తి చేయించి తాగునీటి సమస్య పరిష్కరించడానికి ప్రయత్నిస్తా.


నెలవల విజయశ్రీ

తిరుపతి

గంజాయిని నిర్మూలిస్తా

తులసి వనంలాంటి ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిని గంజాయి వనంలా వైసీపీ నేతలు మార్చేశారు. గతంలో కరుణాకర రెడ్డి మోకాటి లోతు నీళ్లలో దిగి మద్యరహిత నగరంగా కావాలని డిమాండు చేశారు.2019లో వైసీపీ అధికారంలోకి వచ్చినతర్వాత తిరుపతిలో గంజాయి కనపడకూడదని చెట్టూ, పుట్టా తిరిగారు. ఈ రెండూ జరగకపోగా మరింతగా పెరిగిపోయింది. తిరుపతిలో అనేక అవాంఛనీయ ఘటనలకు విచ్చలవిడి మత్తు పదార్థాల వినియోగమే కారణం. జనావాసాలు లేని చోట్ల వేసిన మాస్టర్ ప్లాన్ రోడ్లు గంజాయి బ్యాచ్‌కు అవాసాలుగా మారాయి. యాత్రికులు, ప్రజలపై దాడులకు దిగుతున్నారు. తిరుపతిలో గంజాయి నిర్మూలనను నా తొలి ప్రాధాన్యతగా తీసుకుంటా. ఇప్పటికే రాష్ట్ర హోం మంత్రి అనిత గంజాయి నిర్మూలనపై స్పష్టమైన ప్రణాళికతో ఉన్నారు.


ఆరణి శ్రీనివాసులు

చంద్రగిరి

రిజర్వాయర్‌గా రాయలచెరువు

రాయలచెరువును రిజర్వాయర్‌గా మార్చడం, తలకోన జలాలను పంటల సాగుకు మళ్ళించడం.. ఇవీ నా తొలి ప్రాధాన్యాలు. ఈ రెండూ చేయగలిగితే నియోజకవర్గం సస్యశ్యామలం అవుతుంది. రైతు పచ్చగా ఉంటే అన్ని వర్గాల ప్రజలూ ఆనందంగా జీవిస్తారు. ఈ పనులను ఆచరణ రూపంలోకి తీసుకువచ్చేందుకు డీపీఆర్ రూపొందించే పనిలో ఉన్నా. డీపీఆర్ తయారు కాగానే సీఎం చంద్రబాబును కలిసి నిధుల మంజూరు కోసం ప్రయత్నిస్తా. ప్రతిపాదనలు తయారు చేయడానికి, అలాగే సంబంధిత ఫైలు కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు రిటైరైన ఇరిగేషన్ ఇంజనీర్ల సేవలు వినియోగించుకుంటా. సాధ్యమైనంత త్వరలో వీటిని సాకారం చేసి చూపిస్తా.


పులివర్తి నానీ

సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

రౌడీయిజం, గంజాయి కనిపించకూడదు

అధికారుల సమీక్షలో సీఎం చంద్రబాబు

కుప్పం నుంచే పేదరిక నిర్మూలన


అధికారులతో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

కుప్పం, జూన్ 26: 'సింపుల్ గవర్నమెంట్, ఎఫెక్టివ్ గవర్నెన్స్ నా విధానం. పేదరిక నిర్మూలనకు కుప్పం నుంచే శ్రీకారం చుడతా. దీంతో పాటు నియోజకవర్గ సమగ్రాభివృద్ధికీ అవసరమైన ప్రణాళికలను తయారు చేయండి' అని అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. కుప్పంలోని డిగ్రీ కళాశాలలో బుధవారం ఆయన జిల్లా, నియోజకవర్గ అధికారులతో అభివృద్ధిపై సమీక్షించారు. అధికారులు కొందరు అధికారుల పనితీరు పట్ల చంద్రబాబు అసహనం వ్యక్తం చేశారు. గత తప్పిదాలను ఎత్తిచూపారు. అలాంటి వాళ్లంతా తమ తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. '2019 వరకు నాపై ఒక్క కేసు కూడా లేదు. అలాంటిది ఈ ఐదేళ్లలో నాపైనా హత్యాయత్నం కేసు నమోదు చేశారు. అనేక అక్రమ కేసులు పెట్టారు. ప్రభుత్వ వ్యవస్థలు నాశనం కావడం నాకు చాలా బాధ కలిగించింది' అని ఫిజికల్, వర్చువల్ పనివిధానాలకు సిద్ధపడాలని సూచించారు. ప్రజోపయోగ కార్యక్రమాలు, పథకాల అమలుకోసం అధికారులు సాధ్యమైనంత వేగంగా స్పందించి ఆయా పనులను కార్యరూపంలో పెట్టాలన్నారు. తమ ప్రభుత్వ ప్రాధాన్యతలు, ఆలోచనలకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. 'కుప్పంలో ఇక రౌడీయిజం కనిపించకూడదు. గంజాయి స్మగ్లింగ్, పెంపకం, దొంగ రవాణా, అసాంఘిక కార్యకలాపాలు ఆగిపోవాలి. రాజకీయ ప్రోద్బలంతో పెట్టిన తప్పుడు కేసులు, తప్పుడు రౌడీషీట్లు ఎత్తేయండి' అని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గత ఐదేళ్లలో ఆవేదన వ్యక్తం చేశారు. 'జిల్లాలోను, కుప్పంలోను మళ్లీ ప్రశాంత వాతావరణం నెలకొనాలి. అందుకు ఇప్పటినుంచే సక్రమమార్గంలో వేగంగా పనిచేయడం ప్రారంభించాలి' అని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

నియోజకవర్గంలో మార్పు కనిపించాలి

కుప్పం నియోజకవర్గంలో కొన్ని సమస్యలు సవాళ్లు విసురుతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రధానంగా తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్టీఆర్ సుజల స్రవంతి ద్వారా ఇంటింటికీ శుద్ధ జలాన్ని అందించే ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కెనాల్‌కు సంబంధించి పెండింగు పనుల పూర్తికి ప్రణాళిక రూపొందించాలన్నారు. పాడి, పట్టు, తేనె ఉత్పత్తులకు అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. పండ్లు, కూరగాయలకు ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు తెస్తామని, అందుకు అవసరమైన నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. కుప్పాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. రైతులకు సబ్సిడీలు అందించడంపై దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి, అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ, ఇతర జిల్లా, నియోజకవర్గ అధికారులు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ పదవులకు

అభినయ్ రాజీనామా

పోలింగ్‌కు 40 రోజుల ముందే చేసినా బయటకు పొక్కనివ్వని యంత్రాంగం



తిరుపతి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ తన పదవికి రాజీనామా చేశారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న 4వ డివిజన్ కార్పొరేటర్ పదవికి కూడా ఆయన రాజీనామా చేశారు. పోలింగ్‌కు 40 రోజుల ముందే రాజీనామా లేఖ సమర్పించారని తెలిసింది. అయితే మున్సిపల్ యంత్రాంగం ఈ విషయం చాలా గోప్యంగా ఉంచింది. ఎన్నికల ఫలితాలు వచ్చేవరకు ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీనామా లేఖను బయటపెట్టవద్దని తీవ్రంగా ఒత్తిడి చేసినట్టు తెలిసింది. ఫలితాల తర్వాత అభినయ్ రాజీనామా చేసినట్టు లీకులు వచ్చినా అధికారులు ధృవీకరించలేదు. అయితే అభినయ్ రాజీనామా లేఖ బుధవారం బయటకు వచ్చింది. తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న నేపథ్యంలో డిప్యూటీ మేయర్ పదవితో పాటు కార్పొరేటర్‌గా రాజీనామా చేస్తున్నట్టు అందులో ఆయన పేర్కొన్నారు. ఏప్రిల్ 6న మేయర్‌కు లేఖ రాయగా, అదేరోజు మేయర్ డాక్టర్ శిరీష రాజీనామా లేఖను ఆమోదించారని తెలుస్తోంది.

గోప్యత ఎందుకు?

రాజీనామాపై ఇంత గోప్యత పాటించడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.జనవరి 4న అభినయ్‌ని ఎమ్మెల్యే అభ్యర్థిగా వైసీపీ అధినాయకత్వం ప్రకటించింది.అప్పటినుంచి ఆత్మీయ సమ్మేళనాలు, సమావేశాలతో బిజీగా మారారు.నామినేషన్ వేయకముందే డిప్యూటీ మేయర్ హోదాతో ఇద్దరు గన్‌మెన్లను ప్రభుత్వం నుంచి నియమించుకున్నారు. నిజానికి డిప్యూటీ మేయర్ హోదాకు గన్‌మెన్లను ఇవ్వరు. చెవిరెడ్డి మోహిత్ రెడ్డి కూడా చంద్రగిరి అభ్యర్థిగా ప్రకటించిన వెంటనే తన ఎంపీపీ పదవికి రాజీనామా ఇచ్చారు. అభినయ్ ఏప్రిల్ 6న ఎవ్వరికీ చెప్పకుండా రాజీనామా చేసేసినా రహస్యంగానే ఉంచారు. ఎలాగూ తామే గెలుస్తామన్న ధీమాతోనే కార్పొరేటర్ పదవికి కూడా రాజీనామా చేసినట్టు తెలుస్తోంది. కాగా ఎన్నికల ఫలితాల అనంతరం అంచనాలు తారుమారవ్వడంతో రాజీనామాను వెనక్కి తీసుకునే ప్రయత్నాలు జరుగుతున్నట్టు సమాచారం.

4వ డివిజన్ నుంచి ఎన్నికై...

తిరుపతిలోని 4వ డివిజన్ నుంచి ఏకగ్రీవంగా అభినయ్ కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. టీడీపీ అభ్యర్థి గీతను వైసీపీ నేతలు బెదిరించడంతో ఆమె నామినేషన్ వేయకుండానే తిరుగుముఖం పట్టారు. 2021 మార్చి 18న అభినయ్ కార్పొరేటర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. నాలుగు నెలల తర్వాత తన పుట్టినరోజైన జులై 30న డిప్యూటీ మేయర్‌గా బాధ్యతలు చేపట్టారు. 31వ డివిజన్ కార్పొరేటర్ సీకే రేవతి ప్రతిపాదించగా 49వ డివిజన్ కార్పొరేటర్ సంధ్యారాణి తదితర కార్పొరేటర్లు బలిపరిచారు. కాగా ప్రతిపాదించిన కార్పొరేటర్ రేవతి ఎన్నికలకు ముందే జనసేనలో చేరిపోయారు.

టీడీపీ ఎంపీటీసీ దంపతుల హత్యకు కుట్ర

● కిరాయి వ్యక్తులతో వైసీపీ నేతల ఒప్పందం ● బహిర్గతం కావడంతో తప్పొప్పుకున్న నిందితులు ● క్షమించి పెద్దమనసు చాటుకున్న ఎంపీటీసీ దంపతులు


ఆరేటమ్మ గుడి ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న మధుసూదన్

ఎర్రావారిపాలెం,జూన్ 26 : టీడీపీ ఎంపీటీసీ దంపతుల హత్యకు కుట్ర పన్ని కిరాయి హంతకులకు సుపారీ కూడా ఇచ్చిన వైసీపీ నాయకుల వుదంతమిది. ఎర్రావారిపాలెం మండలం కూరపర్తివారిపల్లికి చెందిన అభ్యుదయవాది అన్నాసముద్రం మధుసూదన్ టీడీపీ నాయకుడు. బీసీ సామాజిక వర్గానికి చెందిన ఇతను అదే గ్రామానికి చెందిన ఈశ్వరమ్మను గతంలో ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఈమె ప్రస్తుతం ఎంపీటీసీ. మధుసూదన్ రాజకీయ ఎదుగుదల చూసి ఓర్వలేని కొందరు పలుసార్లు గొడవపడ్డారు. మండలానికి చెందిన ఓ బడా వైసీపీ నాయకుడి సహకారంతో ఆ పార్టీ వర్గీయులు ప్రతాపరెడ్డి, సిద్ధరామిరెడ్డి, నారాయణరెడ్డి ఎంపీటీసీ దంపతులను హత్య చేసేందుకు కుట్ర పన్నారు. కేవీపల్లికి చెందిన కిరాయి వ్యక్తులతో రూ.5లక్షలకు ఒప్పందం చేసుకున్నారు. ఎర్రావారిపాలెం, తిరుపతి ప్రాంతాల్లో కిరాయివ్యక్తులు రెండుసార్లు హత్యకు ప్రయత్నించి విఫలమయ్యారు. ఈ క్రమంలో ఎన్నికలు జరగడం, టీడీపీ అధికారంలోకి రావడంతో కిరాయి ముఠా పన్నాగం ఆలస్యమైంది.దీంతో హత్య చేసేందుకు తామిచ్చిన డబ్బు తిరిగి చెల్లించాలని కిరాయి వ్యక్తులపై వైసీపీ నేతలు ఒత్తిడి తెచ్చారు. అప్పటికే మధుసూదన్ మంచితనం గురించి తెలుసుకున్న కిరాయి వ్యక్తులు మనసు మార్చుకున్నారు. హత్య పన్నాగం గురించి అతడికే చెప్పి క్షమించాలని కోరారు. హత్య కుట్రదారులు తమతో జరిపిన ఫోన్ సంభాషణలను కూడా మధుకు వినిపించారు. హత్య కుట్ర బహిర్గతం కావడంతో గ్రామస్తులందరూ విస్మయం చెందారు. ఈ నేపథ్యంలో ఆరేటమ్మ గుడి ప్రాంగణం వద్ద బుధవారం మండలానికి చెందిన పెద్దలందరూ సమావేశమై వైసీపీ నేతలు ముగ్గురినీ పిలిపించారు.కుట్రదారులు తమ అపరాధాన్ని మన్నించాలని వేడుకొన్నారు. ఆరేటమ్మ గుడి అభివృద్ధికి తలో రూ.10 లక్షలు ఇస్తామన్నారు. వీరిని గ్రామ బహిష్కరణ చేయాలని తీర్మానించినా మధుసూదన్ వద్దని వారించారు. కక్షప్రతీకారం వీడి కలసి ఉందామని హితవు పలికారు.ఈలోపు కుట్రదారులకు గ్రామస్తులు దేహశుద్ధి చేశారు.

6 కేజీల గంజాయి పట్టివేత

మంగళం, జూన్ 26 : తిరుపతి నగర శివారు ప్రాంతమైన మంగళం పరిధిలోని బొమ్మల క్వార్టర్స్ వద్ద 6 కేజీల గంజాయిని పట్టుకున్న పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. తిరుచానూరు సీఐ శ్రీకాంత్ రెడ్డి కథనం మేరకు...బొమ్మల క్వార్టర్స్‌లో గంగాధర్, కృష్ణారెడ్డి,ఫరీదా అనే ముగ్గురు గంజాయి అమ్ముతున్నట్టు తెలుసుకున్న పోలీసులు బుధవారం వారిని అదుపులోకి తీసుకున్నారు.గతంలోనూ వీరు గంజాయి కేసుల్లో నిందితులైనట్టు గుర్తించారు.గంజాయి విక్రయాలతో ఇక్కడి ఇంజనీరింగ్ కాలేజీల విద్యార్థులు పెడదారి పట్టడంతో పాటు స్థానిక యువత నేరాలు,ఘోరాలకు పాల్పడుతున్నారని సీఐ తెలిపారు.నిందితులపై తిరుచానూరు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్ సేవలు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 26: గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్ సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జిల్లా అధికారి డి.సుశీలాదేవి పేర్కొన్నారు. ఉచితంగా నూతన ఆధార్‌కార్డు నమోదు, రూ.30తో ఆధార్ కార్డు ప్రింట్, ఇంటి చిరునామా, పుట్టినతేదీ, పేరు, మొబైల్ నెంబరు, ఈ మెయిల్ ఐడీ మార్చుకోవాలంటే రూ.50, బయోమెట్రిక్, ఫొటో అప్‌డేట్‌కి రూ.100 చెల్లించాలన్నారు.5-7సంవత్సరాలలోపు పిల్లలకు, 15-17సంవత్సరాల వారికి ఉచితంగా తప్పనిసరి బయోమెట్రిక్ అప్డేట్, 7-15సంవత్సరాలలోపు వారు, 17సంవత్సరాలు పైబడినవారు రూ.100చెల్లించి బయోమెట్రిక్ అప్డేట్ చేసుకునే సేవలను అందుబాటులోకి తెచ్చిందని వివరించారు.తిరుపతి జిల్లా పరిధిలోని పౌరులు తమ ఆధార్‌కార్డు చిరునామాలో జిల్లా పేరును తిరుపతి జిల్లాగా మార్పు చేసుకునేందుకు ఆధార్ ప్రాధికారసంస్థ అవకాశం కల్పించిందని తెలిపారు. అన్ని పని దినాల్లో ఉదయం 10.30నుంచి సాయంత్రం 5గంటలవరకు ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు

ఎమ్మెల్యే విజయశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

ఓజిలి, జూన్ 26: విజన్ ఉన్న సీఎం చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. ఓజిలి మండలం మాచవరంలో బుధవారం జరిగిన విజయోత్సవ సభలో ఆమె మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందించే దిశగా నిరంతరం శ్రమించే అధినేత ఆధ్వర్యంలో సభ్యురాలిగా ఉండడం సంతృప్తినిస్తోందన్నారు. తనపై నమ్మకముంచిన నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానన్నారు. సమస్యల పరిష్కారం కోసం అధికారులతో మమేకమై పని చేస్తానన్నారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ... గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి బి.శ్రీధర్, ఓజిలి మండల ప్రధాన కార్యదర్శి డి.నిరంజన్, టీడీపీ కన్వీనర్ జి.విజయకుమార్‌నాయుడు, పార్టీ ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాసులురెడ్డి, తెలుగు మహిళ నాయకురాలు పవిత్రారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి పి.ప్రకాశ్‌నాయుడు, పెళ్లకూరు మండల టీడీపీ కన్వీనర్ కృష్ణయ్య, మైనార్టీ నాయకుడు ఎస్‌కె ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై దృష్టి పెట్టండి: కురుగొండ్ల



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, జూన్ 26: నియోజకవర్గంలో అధ్వానంగా వున్న రోడ్లను గుర్తించి ప్రతి పాదనలు సిద్ధం చేస్తే మరమ్మతులకు నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం ఆయన తన నివాసంలోని టీడీపీ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలు అధ్వానపు రోడ్లపై ప్రయాణించలేక నరకం అంటే ఏమిటో చూశారన్నారు. గతంలో అడ్డగోలుగా మంజూరు చేసిన పనులను రద్దు చేయాలని, ప్రజలకు అవసరమైన పనులు గుర్తించాలన్నారు. నాణ్యత లేకుండా జరిగిన పనులపై విచారణ చేపట్టడమే కాకుండా స్వప్రయోజనాల కోసం పనులు చేసి ఉంటే రికవరీ చేయిస్తామన్నారు. తనకు పోలీస్ కాన్వాయ్ అవసరం లేదని, తన స్కూటర్‌పై తిరిగి సమస్యలు తెలుసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ అధికారులు, సీఐ సంపమేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు వెంకటగిరి మంలంలోని పాలకొండ సత్రంలో పిచ్చికుక్క దాడిలో గాయపడిన వారిని పరామర్శించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ రాజేశ్వరరావు, తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద్ నాయుడు, ఎంపీపీ తనూజా రెడ్డి, టీడీపీ రూరల్ అధ్యక్షుడు పి.చంద్రమౌళిరెడ్డి, అవ్వారు సత్యం, పి.కోటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార బాధితురాలికి ఎమ్మెల్యే పరామర్శ



విద్యా కిట్ల పంపిణీలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు అర్బన్, జూన్ 26: గూడూరు మండలంలోని ఓ గ్రామంలో కొద్దిరోజుల క్రితం అత్యాచారానికి గురైన బాలిక కుటుంబాన్ని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పరామర్శించారు. రూ.లక్ష ఆర్థికసాయాన్ని అందించారు. గాంధీనగర్‌లో నూతనంగా నిర్మించిన విఘ్నేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ఎమ్మెల్యే వెండి కిరీటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. అంతకుముందు గాంధీనగర్‌కు విచ్చేసిన ఎమ్మెల్యేకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. అక్కడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శ్రీకాంత్ దాతృత్వంతో విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పాశం అందించారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యా కిట్లను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో పి.శ్రీనివాసులు, వి.శివకుమార్, బి.చెంచురామయ్య, ఎస్.భాస్కర్‌రెడ్డి, కె.వెంకటేశ్వర్లు రాజు, గంగారెడ్డి, జి.లీలావతి, భారతి, ఎంఈవో కాంచన తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటా



విజయోత్సవ ర్యాలీలో ప్రసంగిస్తున్న విజయశ్రీ

నాయుడుపేట, జూన్ 26: సూళ్లూరుపేట నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. బుధవారం అంబేడ్కర్ విగ్రహం నుంచి గాంధీమందిరం పార్కు వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో ఆగిపోయిన సమ్మర్ స్టోరేజీలు, టిడ్కో ఇళ్ల వంటి వాటిని పూర్తి చేయించి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫి తదితరులు ప్రసంగించారు. జనసేన ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్, బీజేపీ నాయకుడు రంగినేని కృష్ణయ్య, టీడీపీ నాయకులు పార్థసారధి, నెలవల రాజేష్, జి.ప్రభావతమ్మ, జి.సుధీర్‌రెడ్డి, ఎ.సుధీర్, చంద్రారెడ్డి, డి.రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చెరువులో అక్రమ నిర్మాణం పరిశీలన

సూళ్లూరుపేట, జూన్ 26: మండల పరిధిలోని కుదిరి చెరువు పొరంబోకులో అక్రమ కట్టడాలను బుధవారం అధికారులు పరిశీలించారు. కుదిరి చెరువులో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు తహసీల్దార్‌కు గ్రామస్థులు, రైతులు ఫిర్యాదు చేశారు. దీనిపై చెరువులో ఇంటి నిర్మాణం చేపడుతున్న వంకా రాజేశ్వరి అధికారులు, గ్రామస్థులు అడ్డుకుంటున్నారని హైకోర్టును ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో కోర్టు రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా విచారణ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. దీంతో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, ఇరిగేషన్ ఏఈ ఠాగూర్ ఆధ్వర్యంలో అధికారుల బృందం పిటీనషనర్, గ్రామస్థుల సమక్షంలో ఇల్లు నిర్మిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. రికార్డులను పరిశీలించగా 2014లో కేసియన్ గుంట పంచాయతీకి చెందిన వంకా రాజేశ్వరికి డేగలపాలెం సర్వే నెం.106లో ఇంటి నిర్మాణానికి అప్పటి అధికారులు పొజిషన్ సర్టిఫికెట్ ఇచ్చి ఉన్నారు. అక్కడ నిర్మించకుండా కుదిరి చెరువు పొరంబోకులోని సర్వే నెం.128లో నిర్మాణం చేపడుతున్నట్లు అధికారులు కోర్టుకు నివేదించనున్నారు.

ప్రతి కుటుంబానికీ పనులు కల్పించాలి

కోట, జూన్ 26: గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద ప్రతి కుటుంబానికి 100 రోజులు పని కల్పించాలని పథక ఏపీవో పూర్ణిమ చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి పనులపై క్షేత్రసహాయకులతో సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఉపాధి పనుల్లో రాయితీలపై కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు అవసరమైన పనులనే గుర్తించాలన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో అందుకు తగ్గట్టుగా పనులను గుర్తించాలన్నారు. ఎక్కడైనా లోపాలు జరిగితే సంబంధిత క్షేత్ర సహాయకులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా డంపింగ్‌యార్డులు

ప్రమాదమని తెలిసినా ఇళ్ల మధ్యే ఏర్పాటు

తడ, జూన్ 26: పరిశ్రమల వ్యర్థాలను డంప్ చేసే యార్డులు తడలో అనధికారికంగా ఇబ్బడిముబ్బడిగా ఏర్పాటు చేశారు. వీటితో ప్రమాదమని తెలిసీ ఇళ్ల మధ్యే ఏర్పాటు చేసుకున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. తడ మండలం పారిశ్రామికంగా అభివృద్ధి చెందింది. శ్రీసిటీ, మాంబట్టు సెజ్‌లతోపాటు సూళ్లూరుపేటలోని తారకేశ్వర టెక్స్‌టైల్స్ పార్కు ఏర్పాటయ్యాయి. అయితే వ్యర్థాలను తరలించేందుకు ఆయా పరిశ్రమలు ప్రైవేట్ వ్యక్తులకు కాంట్రాక్ట్ పద్ధతిలో అప్పగిస్తుంటారు. దీంతో ఈ వ్యర్థాల తరలింపు వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. దీంతో పలువురు అనధికారికంగా డంపింగ్‌యార్డులను నిర్వహిస్తున్నారు. ఒక్క తడ మండలంలోనే సుమారు 16 వరకు ఈ తరహా డంపింగ్‌యార్డ్‌లున్నాయి. వీటికి అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు లేవు. అగ్నికారక వ్యర్థాలు డంప్ చేయాలంటే సంబంధిత అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలి. అయితే ఎవ్వరూ తీసుకున్న దాఖలాలు లేవు. ఈక్రమంలో ఈనెల 10న మాంబట్టు సెజ్‌లో ఇలాంటి డంపింగ్‌యార్డులోనే అగ్నిప్రమాదం జరగడం... 24 గంటలైనా మంటలు అదుపులోకి రాకపోవడంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది.





పూడి, భీములవారిపాళెం వద్ద ఉన్న అనధికార డంపింగ్‌యార్డులు

కారూరుమిట్టలోని డంపింగ్‌యార్డ్‌లో ఈనెల 18న సాయంత్రం మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది వెంటనే అదుపుచేశారు. పరిశ్రమల కొయ్య వ్యర్థాలు కొంతమేర కాలిపోయాయి. పక్కనే ప్లాస్టిక్ వ్యర్థాలకు మంటలు అంటుకోకుండా స్థానికులు చొరవ తీసుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఇకనైనా అధికారులు వీటిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. దీనిపై ఎస్ఐ నరసింహారావు వివరణ ఇస్తూ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డులపై చర్యలు తీసుకుంటామన్నారు.

మాదకద్రవ్యాలు విక్రయిస్తే కఠిన చర్యలు

గూడూరు అర్బన్/ వెంకటగిరి/ నాయుడుపేట టౌన్/ సూళ్లూరుపేట, జూన్ 26: మాదకద్రవ్యాల జోలికి వెళితే కఠిన చర్యలు తప్పవని సెబ్ ఏఈఎస్ రమేష్ హెచ్చరించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా గూడూరు పట్టణంలోని టవర్‌క్లాక్ సెంటర్ వద్ద వివిధ కళాశాలకు చెందిన విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మత్తుపదార్థాలు విక్రయించినా, కలిగి ఉన్నా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి రహిత రాష్ట్రం కోసం ప్రతిఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సెబ్ సీఐ రమేష్, ఎస్ఐ మోసెస్, సిబ్బంది కిరణ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు. మాదకద్రవ్యాల వినియోగంతో నిండు జీవితాన్ని కోల్పోతారని సెబ్ సీఐ వినయ్‌కుమార్ అన్నారు. వెంకటగిరి పట్టణంలోని క్రాస్‌రోడ్డు నుంచి ఎన్‌జేఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. మాదక ద్రవ్యాల వినియోగం ద్వారా మానసిక, శారీరక రుగ్మతలతోపాటు నైతికంగా పతనమవుతారని సెబ్ సీఐ అరుణకుమారి అన్నారు. నాయుడుపేటలోని టీఎంఆర్ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలు వివరించారు. కళాశాల నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఎంఆర్ విద్యాసంస్థల అధినేత టి.మనోహర్‌రెడ్డి, సెబ్ ఎస్ఐ మునీర్, ఎస్ఐ గోపీ, కళాశాల సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు. సూళ్లూరుపేట పట్టణంలో సెబ్, పోలీసులు విద్యార్థుల ఆధ్వర్యంలో మత్తుపదార్థాల వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ వద్ద మానవహారం నిర్మించారు.



గూడూరులో జరిగిన అవగాహన ర్యాలీ

ఎన్‌బీకేఆర్‌లో మాదక ద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ

కోట, జూన్ 26: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ యాంటి డ్రగ్ డే ర్యాలీ నిర్వహించారు. ఇక్కడ ఇంజనీరింగ్ కళాశాలలో వారం రోజులుగా నావెల్ యూనిట్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో 4వ వార్షిక శిబిరాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా 200 మంది ఎన్‌సీసీ క్యాడెట్లతో ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి విద్యానగర్‌లోని గాంధీబొమ్మ సెంటర్ వరకు మాదక ద్రవ్యాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అవగాహనతో మాదక ద్రవ్యాలను తరిమికొడతామంటూ పిలుపునిచ్చారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, నరేంద్ర, మస్తానయ్య తదితరులు ఉన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

అతిసార ప్రబలకుండా చర్యలు

కోట, జూన్ 26: మండలంలోని చిట్టేడులోని ఉన్నత పాఠశాల, ఎస్టీ గురుకులం, జూనియర్ కళాశాలల్లో బుధవారం నీటి నమూనాలను అధికారులు సేకరించారు. క్లోరినేషన్ చేపట్టారు. అతిసార ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. తహసీల్దారు నాగరాజరావు, ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దక్కిలి: మండలంలోని కమ్మపల్లి ఎంపీయూపీ, దక్కిలి బాలయోగి బాలికల గురుకుల కళాశాల, వెంబులూరు ఎంపీయూపీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, డి.వడ్డిపల్లి బీసీ వెల్ఫేర్ స్కూలు, హస్టళ్లలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై తహసీల్దార్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఎంపీడీవో లీలామాధురి, డీటీ ప్రసన్న, ఈవోపీఆర్డీ ఎస్‌కె అల్లాభక్షు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగరాజు, ఎంఈవోలు పి.జగదీష్ బాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చిల్లకూరు: మండలంలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, అంబేడ్కర్ గురుకుల పాఠశాలతోపాటు గ్రామాల్లో తహసీల్దారు శ్రీనివాసులు ఆధ్వర్యంలో తాగునీటి ట్యాంకులను పరిశీలించి క్లోరినేషన్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ మీరాసాహెబ్, చింతవరం జడ్పీ హెచ్‌ఎం శివసుబ్రమణ్యం, మల్లికార్జున్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: మండలంలోని పాఠశాలలు, వసతిగృహాల పరిసరాలను తహసీల్దారు కె.వి.ఆర్.వి.ప్రసాదరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో అన్నపూర్ణ రావు పరిశీలించి క్లోరినేషన్ చేయించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి సుహాసిని, వైద్య సిబ్బంది సుస్మిత పాల్గొన్నారు.

చిట్టమూరు: అతిసార ప్రబలుతున్న నేపథ్యంలో మండలంలో డిప్యూటీ తహసీల్దార్ నిరంజన్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది పలు గ్రామాలు, ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు.



నీటి పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న నాయుడుపేట మున్సిపల్ కమిషనర్

సూళ్లూరుపేట: మండలంలోని పాఠశాలల్లో సచివాలయ సిబ్బందితోపాటు వైద్య సిబ్బంది చెత్తాచెదారం తొలగించారు చేశారు. ఎంపీడీవో చంద్రమౌళి మాట్లాడుతూ పాఠశాలల పరిసరాలు, వంటచేసే ప్రాంతాల్లో నీళ్లు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. సూళ్లూరుపేట పట్టణంలోని గురుకల పాఠశాలను తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ పరిశీలించారు. ఎంఈవోలు శీనయ్య, శ్రీనివాసుల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరి చేరవని మున్సిపల్ కమిషనర్ జనార్దన రెడ్డి అన్నారు. నాయుడుపేట మండలం పుదూరులోని బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలను బుధవారం ఆయన పరిశీలించారు. తాగేనీరు, భోజనాల నాణ్యతను పరిశీలించారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలే దృష్ట్యా తాగునీరు కలుషితం కాకుండా చూడాలని అలాగే నాణ్యమైన ఆహారాన్ని అందించాలని గురుకుల ప్రిన్సిపాల్ రూత్ రమోలాను ఆదేశించారు.

గుంతలతో వరగలి క్రాస్ రోడ్డు ప్రధాన రహదారి

రాకపోకలకు అవస్థలు పడుతున్న వాహనదారులు





పారిచెర్లవారిపాళెం, నల్లయ్యగారిపాళెం సమీపంలో అధ్వానంగా ఉన్న రోడ్డు

చిల్లకూరు, జూన్ 26: మండలంలోని పలు గ్రామాల సమీపంలోని ప్రధాన రహదారి దెబ్బతిని, రాళ్లుతేలి, గుంతలతో దారుణంగా ఉంది. దీంతో ఈ రోడ్డుపై రాకపోకలు సాగించాలంటే వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆటోల్లో ప్రయాణించే వారైతే గతుకుల రోడ్డులో నరకయాతన పడుతున్నామని వాపోతున్నారు. మండలంలోని వరగలి క్రాస్ రోడ్డు నుంచి తమ్మినపట్నం వరకు ఆయా గ్రామాల మీదుగా సుమారు 35 కిలోమీటర్ల వరకు ప్రధానరహదారి ఉంది. ఈ రహదారి పలు గ్రామాల సమీపంలో దెబ్బతిని అధ్వానంగా ఉంది. ప్రధానంగా పారిచెర్లవారిపాళెం, నల్లయ్యగారిపాళెం, చేడిమాల, తిక్కవరం, కలవకొండ, రామారెడ్డిపాళెం, చింతవరం, ఏరూరు తదితర గ్రామాల వద్ద రోడ్డు దెబ్బతిని గుంతలు ఏర్పడివుంది. పారిచెర్లవారిపాళెం సమీపంలోనే నాలుగు చోట్ల రాళ్లు తేలింది. అదేవిధంగా ఏరూరులో మూడుచోట్ల, నల్లయ్యగారిపాళెం, చేడిమాల, తిక్కవరం వద్ద రెండుచోట్ల గతుకులతో దుస్థితిలో ఉంది. ఈ మార్గంలో సిలికా వాహనాలు అధికలోడ్‌తో రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్డు దెబ్బతిన్నాయని గ్రామీణులు అంటున్నారు. వర్షం కురిస్తే గుంతల్లో నీరు నిల్వ చేరుతుండడంతో ఎక్కడ గుంత ఉందో తెలియక ఇబ్బంది పడుతున్నారు. ఏరూరు సచివాయం వద్ద, సచివాలయం సమీపంలో, దళితవాడ వద్ద రోడ్డు మడుగులను తలపిస్తోంది. ఈ మార్గంలో పలుమార్లు వాహనదారులు ఇరుక్కుపోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. సుమారు ఎనిమిది నెలలుగా రోడ్డు దెబ్బతిని దారుణంగా ఉన్నా ఆర్అండ్‌బీ అధికారులు కనీసం మరమ్మతులు కూడా చేపట్టలేదని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అతిసారతో రెండేళ్ల బాలిక మృతి

కేవీబీపురం, జూన్ 26: మండలంలోని కాట్రపల్లి గ్రామంలో దుశ్యంత్, కామాక్షి దంపతుల కుమార్తె దర్శిని(2) అతిసారతో మృతిచెందింది. గత నాలుగు రోజులుగా గ్రామంలో అతిసార ప్రబలడంతో పలువురు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. బుధవారం దర్శిని మృతి చెందింది. బాలిక మృతి విషయం తెలుసుకున్న సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం వెంటనే జిల్లా వైద్యాధికారి శ్రీహరిని, వైద్యాధికారి కుమార్‌ను గ్రామానికి పిలిపించి వైద్య సేవలపై ఆరా తీశారు. దర్శిని మృతదేహానికి నివాళులర్పించారు. యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి అతిసారను అరికట్టాలని ఆదేశించారు. బాధితులకు అవసరమైన మందులు, వసతులు వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే బీజేపీ నాయకుడు కోలా ఆనంద్, వైసీపీ నేతలు రాజేష్, కృష్ణయ్య తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.



చిన్నారికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

తడ కండ్రిగలో పోలేరమ్మ జాతర



అంబళ్లు తీసుకువెళ్తున్న గ్రామస్తులు

తడ, జూన్ 26: మండలంలోని తడ కండ్రిగలో పోలేరమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. బోడిలింగాలపాడు సమీపంలో ఉన్న పోలేరమ్మ బండ వద్ద బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. మధ్యాహ్నం గ్రామంలోని అన్ని ప్రాంతాల నుంచి గ్రామస్తులు అంబళ్లను ఊరేగింపుగా పోలేరమ్మ బండ వద్దకు తీసుకువచ్చారు. అక్కడ పూజలు జరిపి అంబళ్లను అమ్మణ్ణికి నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం చల్లాటమ్మ ఆలయం వద్దకువెళ్లి అంబళ్లతోపాటు పొంగళ్లను పొంగించి అమ్మణ్ణికి సమర్పించారు. రాత్రికి పోలేరమ్మ గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. భారీగా బాణసంచా కాల్చారు.

అభివృద్ధి పనులకు సహకరిస్తా



కాళంగి గ్రాయిన్‌ను పరిశీలిస్తున్న వరప్రసాద్

తడ, జూన్ 26: సూళ్లూరుపేట నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి పనులకు సహకరిస్తానని మాజీ ఎంపీ వి.వరప్రసాదరావు అన్నారు. బుధవారం ఆయన దెబ్బతిన్న కాళంగి గ్రాయిన్‌ను పరిశీలించారు. నిలిచిపోయిన టెండర్ల ప్రక్రియ వివరాలను ఇరిగేషన్ అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎమ్మెల్యే విజయశ్రీతో కలసి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కాళంగిగ్రాయిన్ శాశ్వత నిర్మాణం, పులికాట్ పూడికతీత, తీర గ్రామాల్లో రోడ్లు, మౌలిక వసతులపై ప్రత్యేకంగా దృష్టిపెట్టి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి పనులను పూర్తయ్యేలా కృషి చేస్తానన్నారు. ఆయనతోపాటు ఇరిగేషన్ డీఈ శ్రీధర్, ఏఈ రమేష్, టీడీపీ నాయకులు బి.పళణి, సెల్వం, బీజేపీ మండల అధ్యక్షుడు రాచర్ల కృష్ణమూర్తి తదితరులు ఆయన వెంట ఉన్నారు.

వైభవంగా లక్షతులసి అర్చన



గూడూరు, జూన్ 26: పట్టణంలోని రాజావీధిలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ లక్షతులసి పూజ, పుష్పయాగాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం జరిపారు. రాత్రికి స్వామి వారికి ఏకాంత సేవ నిర్వహించారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే జైలుకే



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

వెంకటగిరి టౌన్, జూన్ 26: యువత ర్యాగింగ్‌కు పాల్పడితే జైలు పాలవడం ఖాయమని ఎస్ఐ జిత్యా నాయక్ అన్నారు. బుధవారం సింహపురి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓ ప్రైవేటు కళాశాలలో ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉన్నప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుతారన్నారు. ఈ కార్యక్రమంలో జి.ఉదయ్‌కుమార్, ప్రవీణ్, సైపుద్దీన్, సాయి, నికేష్, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ మహోత్సవం

పెళ్లకూరు, జూన్ 26 : మండలంలోని అక్కగారిపేటలో అగ్నిగుండ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కంకణాలు ధరించిన భక్తుల భజనలు ఆకర్షించాయి. గ్రామంలో గోవిందనామ స్మరణలతో ఊరేగింపుగా వచ్చి అగ్నిగుండ ప్రవేశం చేశారు.

బడిఈడు పిల్లలందరూ పాఠశాలలోనే ఉండాలి

నాయుడుపేట టౌన్, జూన్ 26 : బడి ఈడు పిల్లలు అందరూ పాఠశాలలో ఉండేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో శాంతి అన్నారు. నాయుడుపేట మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వర్షాకాలం కావడంతో అతిసార ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో పరిశుభ్రమైన తాగునీటిని విద్యార్థులకు అందించాలన్నారు. అలాగే ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. ఎంఈవో-2 మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ఆర్థికసాయం

సూళ్లూరుపేట, జూన్ 26: పట్టణంలోని బాపూజీ కాలనీకి చెందిన దివ్యాంగుడు తుపాలకు చంద్రయ్యకు బుధవారం చిరంజీవి సేవా సంఘ నిర్వాహకులు రూ.10 వేలు సాయం చేశారు. దివ్యాంగుడైన చంద్రయ్య ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. ఇటీవల ఆటోను కొందరు ధ్వంసం చేసిన నేపథ్యంలో స్పందించిన చిరంజీవి సేవా సంఘ అధ్యక్షుడు మాబాషా ఆటో మరమ్మతుల కోసం ఆర్థిక సాయాన్ని అందినట్లు తెలిపారు. టీడీపీ నాయకురాలు బుద్ధి విజయలక్ష్మి, హరిబాబు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి వితరణ

సూళ్లూరుపేట, జూన్ 26: పట్టణానికి చెందిన ఎం. ప్రేమ్ కుమార్ జయంతిని సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు బుధవారం మన్నారుపోలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎ.రమేష్, డి.రవి, కె.వెంకటేశ్ యాదవ్, మహీధర్ నాయుడు, మణిపాల్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

సూళ్లూరుపేట, జూన్ 26: పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకున్నట్లు ఎస్ఐ టి.రహీంరెడ్డి తెలిపారు. ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ బస్టాండు, జీఎన్‌టీ రోడ్డులోని కూరగాయల మార్కెట్ సెంటర్, షార్ వై జంక్షన్ వద్ద సిబ్బందిని నియమంచినట్టు తెలిపారు. వాహన చోదకులు, పట్టణ ప్రజలు ట్రాఫిక్ నియమాలు పాటించాలని కోరారు.